39

డిసెంబర్ 1972

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

శివసాగర్

రెండు గీతాలు

జనం ఊపిరితో

కీచకవధ

కథ

భూ(త)సంస్కరణ

కాంట్రివర్సీ

చైతన్యధార

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

1 రు.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

39

డిసంబర్ 1972

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

64 పేజీలు 1 రూపాయి

విడిప్రతి: ఒక రూపాయి
అర్ధసంవత్సర చందా: ఆరు రూపాయలు
సంవత్సర చందా: పది రూపాయలు

ప్రతులకు, వివరాలకు:
సృజన
హనుమకొండ
వరంగల్ - 506001

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited and Published by Varavararao for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J. P. N. Road, Warangal-506002 (A.P.)

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

1972 డిసెంబర్ మాస పత్రిక 39

వి. ర. సం. తీర్మానం

కరువు

దేశంలో ఘోరమైన కరువు తాండవిస్తున్నది. వరదలు తుడిచిపెట్టుక పోయిన ప్రాంతాలు ఒకవంక, నేల బీటలువారి నాలుక తడుపుకోడానికి నీళ్ల చుక్కలేని ప్రాంతాలు ఒకవంక దేశమంతా ప్రభుత్వంలేని అవ్యవస్థలాగున్నది. అట్లని ఈ దేశంలో ప్రభుత్వం లేదనికాదు; దోపిడీ వర్గాన్ని కాపాడే ప్రభుత్వం ఉన్నది. ఆహార ధాన్యాలు లేవనికాదు; దేశమంతా సరిపోయేటన్ని ఉన్నాయి. కాని అవి ఆ వర్గం గుప్పిట్లో ఉన్నాయి. అవి ప్రభుత్వ గిడ్డంగులలోంచి ప్రజల నోట్లోకి వచ్చేవరకు క్యూలల్లో కన్నీళ్లు, బియ్యంలో రాళ్ళు మిగుల్తున్నవి. ఆకలి మండినకొద్దీ ధరలు మండుతున్నవి. బ్లాక్ మార్కెట్లను అధికధరలను ఆకలికి వ్యతిరేకంగా పోలీసు బలంతో కాపాడడానికి కృతనిశ్చయంతోవున్న పాలకవర్గం వెండి కిరీటాలు తొడుక్కుంటున్నప్పుడు కరువు గాక దేశంలో మరేముంటుంది. రేషన్ దుకాణాలు ఎక్కువచేసినా, చౌక దుకాణాలు అంతటా తెరిచినా, గంజి కేంద్రాలు నెలకొల్పినా యింకా కొంత మంది దళారీలు బాగుపడడమేతప్ప ఒరిగేదేమీ ఉండదు. ఈ పాటి కోరికలు సాధించడానికి బృహత్తరమైన ఆకలి యాత్రలు, 'పోరాటాలు' కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇందిరా నిర్వహించడం, ఆల్ ఇందిరా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దాన్ని వ్యతిరేకించము అని ప్రకటించడం కృత్రిమకాటక నాటకంలోని భాగాలే. 'గరీబీహఠావో' ఇందిరానినాదం ఎంతకెరటంగా ఎన్నికల్ని గెల్చుకోగలిగిందో ఘండుతున్న ఆకలిముందు అంత ఘోరంగా విరిగిపడుతున్నది. సెక్యులర్ ప్రభుత్వం సిగ్గువిడిచి రుద్రాభిషేకాలు, పూజలు చేయమని చెప్తూ, కరువులో వాంతిలా ఉన్న నిధులను మంత్రుల కరువు ప్రాంతాల పర్యటనా డిన్నర్లకు, జీర్ణదేవుళ్ల ఉద్ధరణాభిషేకాలకు ఖర్చు పెడుతుంటే ప్రజల ఆకలి - కరువు సమస్యకు శాస్త్రీయ కారణాలు తెలుసుకుంటున్నది. ఆకలి పరిష్కార ఆయుధాలు అందుకొంటున్నది. విరసం ఆకలిగొన్న ప్రజల ప్రతిచర్యను సమర్థించి తీరుతుంది.

విరసం అధ్యక్షోపన్యాసం:
ఈనాడు విప్లవం ప్రపంచ వాస్తవికత

శ్రీ శ్రీ

"కలాన్ని ఆయుధంగా ధరించిన సహయోధులకు నా విప్లవజోహార్లు. కాన్ఫ్రెన్స్ మూడవసారి మన విరసం వార్షిక సభ జరుపుకుంటోంది. ఇది మూడో అక్టోబరు. ఇది విప్లవాల మాసం. కొత్తకేలెండరు ప్రకారం ఒకనెల తప్పించి నవంబరు 7వ తారీఖున రష్యా జాతీయదినం జరుపుకొంటున్నా అక్టోబరు విప్లవమనే ఇప్పటికీ దాని పేరు. చైనా విప్లవంకూడా అక్టోబరు నెలలోనే జయించింది. అటువంటి నెలలో మొదటిసారి 1970 లో మనం ఖమ్మంలో సమావేశమైనాము. నాటినుంచి నేటివరకు మనది uphill task కొండమీదకెక్కే ప్రయత్నం. అయితే పర్వతారోహణ చేస్తామని బయల్దేరిన కొందరిలాగ మనం దిగజారిపోలేదు. We are the ascendant now. ప్రపంచం మొత్తంమీద అన్ని విప్లవ శక్తుల్లాగే మనంకూడా ఉన్నత శిఖరాల నధిరోహించే ఉద్యమం నడిపిస్తున్నాము. ఎంత మేకపోతుగాంభీర్యం చూపిస్తున్నా మన శత్రువులు ఓడిపోతున్నారు. మనం గెలుస్తున్నాము. ఇది వాళ్ళకీ తెలుసు. మనకీ తెలుసు. సిద్ధాంతరీత్యా మనల్ని ఓడించడంమాట అటుంచి మనతో పోరాడడానికైనా శక్తిలేనివాళ్ళు విరసం చీలిపోయిందన్న విషప్రచారానికి పాల్పడుతున్నారు. 1970 నాటికంటె విరసం ఈనాడు మరింత పటిష్ఠంగా పని చేస్తున్నదనేది కళ్ళు మూసుకుపోయిన వాళ్ళకుకూడా కనిపించే సత్యం.

ఢంకాని జోకొట్టాలనీ, అలల్ని అరికట్టాలనీ, గాలిని ఉరితియ్యాలనీ యిదివరకెన్నో ప్రయత్నాలు జరిగేయి. ఇక ముందుకూడా జరుగుతాయి కాని అవి ఎన్నడూ ఫలించలేదు ఇక ముందుకూడా ఫలించబోవు. విరసానిది వచ్చేకాలం. విరసం విరోధులది పోయేకాలం. విరసం రేపటి సంగతులను ఇవాళే ఆలోచించేసంస్థ. ఇది భవిష్యత్తుని తీర్చిదిద్దేబాట. గ్రహచారంమీద ఆధారపడేదికాదు. ఇది మార్క్సిస్టు దర్శనానికి నిబద్ధమై, గతితార్కిక భౌతికవాదపు వెలుతురులో సామాజిక పరిణామాన్ని సందర్శిస్తుంది అందుకే రెండురెళ్ళు నాలుగనేది ఎక్కడైనా ఎప్పుడైనా ఎంత సత్యమో, యావత్ప్రపంచమూ సామ్యవాద మానవుడి శాసనం కిందకి వస్తుందనేది కూడా అంతే సత్యం.

అయితే సూర్యుడులాంటి యీ సత్యానికి మబ్బులాంటిది మతం. అందుకనే మతాన్ని మనుష్యులపాలిటి నల్లమందుగా అభివర్ణించాడు మార్క్స్. అనాదినుంచీ ఈ మతాలు మనిషికీ మనిషికీ మధ్య మాయగోడలు నిర్మించాయేతప్ప మనుష్యులందర్నీ ఏ మతమూ ఒకటిగా చెయ్యలేక పోయింది. అలాచేసేశక్తి ఏమతానికీ లేదు. పైగా మనిషిమీద మనిషికుండవలసిన విశ్వాసాన్ని లేకుండాచేస్తుంది మతం దేవుడనే హేతువాద దూరమైన భావాన్ని ఆరాధిస్తూ శాస్త్రీయ విజ్ఞానానికి పోటీగా మూఢవిశ్వాసాలను నిలబెడుతుంది. విప్లవ రచయితలు మొట్టమొదట పోరాడవలసింది ఈ మూఢవిశ్వాసాలతోనే, దానికి తోడు ఒక్కొక్క విప్లవ సాహిత్యపు వీరయ్యకూడా ఉంటే మరీ మంచిదంటాను. దిన వారపత్రికలు దేశంనిండా అల్లుకుపోయి బూజుపట్టిన బూర్జువా భావాలను ప్రచారంచేస్తున్నా, వీరయ్యలు పంచిపెట్టే వెయ్యి కరపత్రాలు చాలు వీటికి విరుగుడుగా పనిచేయ్యడానికి.

ఎక్కడో చదివాన్నేను పెట్టుబడిదారీ విధానానికి చెత్తసాహిత్యం చాలా అవసరమని! అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలమాట అటుండగా ఇప్పుడిప్పుడే ఓనమాలు నేర్చుకుంటున్న మనదేశంలోని భాషాపత్రికల్ని చూడండి వీటిలో రాసేవాళ్ళంతా పత్రికా స్వాతంత్ర్యానికీ, వ్యక్తి స్వాతంత్రానికీ నివాళులెత్తేవాళ్ళే. విప్లవరచయితలంతా "సంఘవిద్రోహులనో, చైనా ఏజంట్లనో 'సహేతుకంగా' ఋజువుచేసేవాళ్ళే." పత్రిక యజమాని విదిలించే ఎంగిలి మెతుకులకు బతుకునే తాకట్టుపెట్టి బస్తాలకొద్ది చెత్తసాహిత్యాన్ని ఉత్పత్తిచేస్తున్నవాళ్ళే, రాశిఫలితాలతో, సినిమా పేజీలతో, కథలతో, కార్టూన్‌లతో, సీరియల్ నవలలతో కుళ్ళు కంపుకొట్టే ఈ చెత్తసాహిత్యంమధ్య కనిపించే వ్యాపార ప్రకటనలు పత్రికాధిపతి పాలిటి పాడిబర్రెలు. ఇక దినపత్రికల సంగతి చెప్పనవసరమేలేదు సంపాదకీయాలతోసహా కలుపుకొని రీడింగుమేటరంతా ఒక ఎత్తయితే ఈ పత్రికా ప్రకటనలు అందుకు రెండింతలు. ఈ ప్రకటనలే పత్రికలను బతికించే ప్రాణవాయువులు. పెట్టుబడిదారీవ్యవస్థలో ఇదితప్పనిసరి. ఒక్క వాణిజ్య ప్రకటనకూడలేకుండా విశాలాంధ్ర పత్రిక వెలువడిననాడు నిజంగా ఆ పత్రిక కమ్యూనిజంకోసం పోరాడుతున్నదని అంగీకరిస్తాను కాని ఈనాటి వాస్తవం ఏమిటంటే బూర్జువా సాహిత్యమూ పత్రికలూ ఒక మహా సముద్రం. అందులో చెదురు మదురు ద్వీపాల్లాంటివి విప్లవ పత్రికలూ. విప్లవ సాహిత్యమూ. కాని ఈ ద్వీపాలను చుట్టూవున్న సముద్రం ముంచెత్తలేదు. ఒకప్పుడు సోవియట్ యూనియన్ కూడా ధనస్వామ్య విధాన సముద్రం చుట్టుముట్టిన ఒకే ఒక సామ్యవాద ద్వీపంగా ఉండేది. స్టాలిన్‌కీ, ట్రాట్స్కీకీ పెద్ద పేచీ యిక్కడే వచ్చింది. ప్రపంచం అంతటా విప్లవం రగుల్తూ ఉంటేనే తప్ప మన సామ్యవాద ద్వీపం వర్ధిల్లలేదన్నాడు ట్రాట్స్కీ. ఒకదేశంలో సామ్యవాదంనిర్మిస్తే అది ప్రపంచమంతటికీ ఆదర్శ

ప్రాయమవుతుందన్నాడు స్టాలిన్. అలాగే తన దేశంలో సామ్యవాద నిర్మాణానికి అడ్డు వచ్చే శక్తులన్నింటినీ నిర్దాక్షిణ్యంగా నిర్మూలించాడు. ఈ మహోద్యమంలో కొన్ని పొరపాట్లు జరిగివుండవచ్చుగాక. అయినా మార్క్సిస్టు మహోపాధ్యాయుడుగా స్టాలిన్ అజరామరుడయ్యాడు.

ప్రపంచం అంతటా సామ్యవాద విప్లవం ఒక పరిపక్వదశకు చేరుకుంటోంది. అందుకే మనదేశంలో సహా ఆచరణమాట యెలావున్నా అరుపుల్లో సామ్యవాదం ఆకాశానికే చిల్లులు పెడుతోంది. ఈనాడు విప్లవం ప్రపంచ వాస్తవికత. విప్లవప్రతీఘాత శక్తులు వాటికి కంచుకోటగా వర్ణించదగ్గ అమెరికాలోకూడా దెబ్బకాచుకునేస్థితిలోపడ్డాయి. ఒక ఎత్తుగడమాత్రంగానే కావచ్చుగాక, నిక్సన్‌లాంటి అఖండశక్తి సంపన్నుడు దూతను పంపి ఆహ్వానం సంపాదించుకొని చైనాను సందర్శించవలసి వచ్చింది. ఈనాడు ప్రపంచం అంతటికీ విప్లవ కేంద్రం, పీడితప్రజల ఆశాజ్యోతి పెకింగ్‌నగరమే. మానవుడు సమ సమాజంఅనే గమ్యంచేరడానికింకా చాలాకాలం పట్టవచ్చును. కాని అందుకు సరిఅయినమార్గం చూపిస్తున్నది చైనా దేశమే అనడానికి సందేహంలేదు. ఎన్నో అపవాదులకు పాల్పడి, అభాండాలకు లోనయిన చీనా సాంస్కృతిక విప్లవం తన ప్రజలకేకాక ప్రపంచ మానవులందరికీ ప్రయాణ దిక్సూచి కాగలుగుతోంది. పనికట్టుకొని దుష్ప్రచారంసాగించేవాళ్లు ఎప్పుడూ ఉంటారు, కాని నిష్పక్షపాత పరిశీలకుల వాఙ్మూలం ఒక్కటేమనకు పరిగణనీయం. పనికిమాలిన చెత్తనంతా పరమపవిత్రంగా భావించేవాళ్ళకి చైనా సాంస్కృతిక విప్లవం అర్థంకావడం కష్టమే. అయినా మనం దాన్ని అధ్యయనం చెయ్యక తప్పదు. అర్థంచేసుకోక తప్పదు.

ఈ సమస్త చరాచర సృష్టిలోనూ అత్యంత సౌందర్యవంతమయినదీ, అత్యంత నిస్సహాయమైనదీ ఏదంటే అప్పుడు పుట్టిన మనుష్య శిశువంటాను నేను. ఈ శిశువు బాధ్యత ఒక్క తల్లిదండ్రులదిమాత్రమే కాదు. సమాజంమొత్తం దీనిబాధ్యత వహించవలసి ఉంటుంది. అలా జరగనప్పుడు ఎన్నో వైపరీత్యాలు సంభవిస్తాయి. శునశ్శేవుణ్ని వాళ్ళతండ్రి యజ్ఞపశువుగా లక్షగోవుల ఖరీదుకి అమ్మేశాడట. బిచ్చానికి పనికొస్తుందని పుట్టిన శిశువుకి కళ్లు పొడిచెయ్యడమో, కాళ్లు విరిచెయ్యడమో యీనాటికీ జరుగుతున్నపనే. గురజాడ అప్పారావుగారు తన కన్యాశుల్కం పీఠికలో పుట్టబోయే ఆడపిల్లలకు పెళ్ళిసంబంధం బేరమాడి శుల్కధనం నిర్ణయించుకునే అమానుషత్వం తీయించిన లెక్కలలో బైటపడిందని రాశారు. ఇవాళకూడా మన పిల్లలు మన సమాజానికి యజ్ఞపశువులుగా అమ్ముడుపోతున్నారు. వాళ్ళ కళ్ళు పొడిచెయ్యకపోయినా శాస్త్రజ్ఞానానికి అంధుల్ని చేసే విద్యావిధానాన్నే మనం అనుసరిస్తున్నాం. గర్భస్థ శిశువు

లకు కాకపోతేనేంగాక ఇప్పుడు జరుగుతున్నవి చాలామట్టుకు యేర్పాటు పెళ్ళిళ్ళేతప్ప వధూవరులు ఒండొరులను ప్రేమించి ఇష్టపడి చేసుకునే వివాహాలుకావు. ఇన్ని అనాచారాలన్నింటినీ మనం సంస్కృతిపేరిటా సంప్రదాయంపేరిటా నెత్తినివేసుకుని ఊరేగుతున్నాం. వీటన్నింటినీ దూదిపింజల్లాగ ఎగరకొట్టే సాంస్కృతిక విప్లవ ఝంఝుని ఆవహనచేస్తూ కలంపట్టడమే మన అవశ్యకర్తవ్యం.

పోనీ మన సాహిత్య అనాధమీలలో కాదు అగాధమీలలో కాదు అకాడమీలలో చూదామూఅంటే అక్కడ కరడుకట్టిన మతవాదులూ, మితవాదులూ, కాకుంటే కేవలం అవకాశవాదులూ బైఠాయించారు. వీళ్ళు నాచన సోముని నయగారాన్ని, మనుచరిత్రి మాధుర్యాలనీ నెమరువేసుకుంటూ తన్మయులవుతూ ఉంటారు. ఇంతకీ పశువులరాజ్యం కదా మనది. జోడెద్దులనుంచి ఆవూ పేడా, కాదు ఆవూదూడాదాకా మనం అభ్యుదయం సాధించాం. ఇది మనుష్యులరాజ్యంగా మారడానికి ఇంకా ఎన్ని మన్వంతరాలు కావాలో నా ఆలోచన కందలేదు

మిత్రులారా! కిందటి విరసం సభల తర్వాత మనదేశంలో రెండు ముఖ్య సంఘటనలు జరిగాయి. (ఇప్పటికీ దేశమంతటా తాండవిస్తున్న కరువు రాక్షసి కరాళ నృత్యం ఇప్పటిమట్టుకు అలా ఉండనిద్దాం) ఏమిటీ రెండు సంఘటనలూ? ఒకటి స్వాతంత్ర్యపు వెండిపండుగ. రెండోది తెలంగాణా సాయుధపోరాటపు రజతోత్సవం రెండింటిమీదా విప్లవ రచయితల సంఘం ఒక్కటే సక్రిమమైన అవగాహనకు వచ్చి సరియైన అంచనా తేల్చింది. మనకు వచ్చిందంటున్న స్వాతంత్ర్యం తెల్లదోపిడిదారు. నల్లదోపిడిదారుకి బదలాయించిన అధికారమేతప్ప పాటుబడే ప్రజాసామాన్యానికి ఒరగబెట్టిందేమీలేదు. మన ఆర్థికవ్యవస్థ 75 గుత్తపెట్టుబడిదారుల గుప్పిటలో చిక్కుపడింది. ఆనాటి అమెరికన్ డాలర్‌గాని, ఈనాటి రష్యన్ రూబుల్‌గాని మన పీడిత ప్రజల పరిస్థితిని మెరుగుపరచలేదు. మనకేవో కొన్ని భారీపరిశ్రమలున్నాయని సంబరపడుతున్నామే తప్ప అన్నింటికన్నా భారీయెత్తున సాగుతున్నది అవినీతిమాత్రమే. అవినీతి లాభాపేక్ష అన్నదమ్ములనడానికి సందేహంలేదు. మన అర్థిక వ్యవస్థలో లాభాపేక్ష నంగీకరించినంతకాలం అవినీతి భారాన్నికూడా మొయ్యవలసిందే. మనది స్వాతంత్ర్యం కాదు, స్వాహాతంత్రం అంటున్న విప్లవకవితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను.

రెండోది తెలంగాణా సాయుధ సమరం. దీన్ని మన ఘనతవహించిన ప్రభుత్వం గుర్తించనేలేదు. పైగా రెండువేలమంది కమ్యూనిస్టుల్ని ఊచకోత కోయించిన ప్రకాశం పంతులుగారి శతజయంతిని వైభవంగా జరుపుకుంది బ్రిటిష్‌వారి గుండు దెబ్బలకు గుండెచూపించిన వీరుడంటూ కాంగ్రెస్ వారాయన్ని మెచ్చుకుంటే నా అభ్యంతరంలేదు. ఏళాలాంటి వాళ్ళెందుకీ భజనలో పాల్గొనాలని నేనడుగుతున్నాను.

మద్రాసు నగరంకోసం మొండిపట్టుపట్టి పొట్టి శ్రీరాములుగారి ప్రాణాన్ని బలి పెట్టిన కిరాతకుడుగా ప్రకాశంగారిని నేను గర్హిస్తున్నాను. తెలంగాణా రైతాంగ పోరాటమే నెహ్రూపండితుడిచేత ఆవడిలో సామ్యవాద మంత్రోచ్చారణ చేయించింది. అసంపూర్తిగా ఉండిపోయిన ఆనాటి సమరం ఇంకా సాగుతోనే ఉన్నదనేది విప్లవరచయితల అవగాహన అలా దేశమంతటా సాగిస్తున్నవారే ఆనాటి పోరాట సంప్రదాయాలకు ఈనాటి వారసులు. ఈ వారసత్వం మాదంటే మాదంటూ చిందులుతొక్కడానికి అన్నదమ్ములు పంచుకునే ఆస్తిహక్కుకాదు. ప్రాణాలనే ఆహుతిగా సమర్పించి సంపాదించుకునే జన్మహక్కు, ఈ విప్లవ పోరాటానికి సంబంధించిన సమగ్ర చరిత్ర యింకా రాయవలసేఉన్నా ఆనాటి సాహిత్యమంతా సమీకరించవలసే ఉంది.

నాగిరెడ్డి, నాగభూషణ పట్నాయక్, చారు మజుందార్, చండ్ర పుల్లారెడ్డి క్రూరులూ, కఠోరులూకారు. వీరిలో కనీసం నాగిరెడ్డిగారిని నేను స్వయంగా ఎరుగుదును. అతనిది వెన్నలాంటిహృదయం. హింసంటే విపరీతమైనద్వేషం, కాని కుళ్ళిపోతున్న కురుపుమీద వైద్యుడు జరిపే శస్త్రప్రయోగాన్ని హింసని యెవ్వడూ అనలేడు. అదే హింసయితే దాన్నే ఈనాటి నికార్సయిన విప్లవకారులు ఆరాధిస్తున్నారు. ఆరాధించి అంకితమవుతున్నారు. అంకితమై ఆహుతిఅవుతున్నారు. అలాంటి హింసనే విప్లవ రచయితలు తమ సమస్త రచనల్లో విశ్లేషించి చూపెడుతున్నారు. విశేషించి గ్లోరిఫైచేస్తున్నారు. చేస్తున్నందుకు గర్విస్తున్నారు.

అంచేతనే అరసం మిత్రులు చాస్తున్నామంటున్న స్నేహహస్తాన్ని అందుకొనడానికి మనకొకే ఒక అభ్యంతరంఉంది. అభ్యుదయ రచయితలారా! మీరు చాస్తున్న చెయ్యి కాంగ్రెసుతో కరచాలనంచేసి చేసి రక్తసిక్తమయింది. అది మా విప్లవవీరులవేడి నెత్తురు. షేక్‌హాండ్ చెయ్యడమే కాదు కాంగ్రెసువాళ్ళతో మీరు పీటముడివేసుకొని కూచున్నారు. గాంధీగారు అస్పృశ్యత కూడదని గగ్గోలుపెట్టినా కాంగ్రెసు పాలకులంతా మాకు అస్పృశ్యులే. వాళ్ళని అంటుకున్నంతకాలం మీరూ అంటరానివాళ్ళే, కాబట్టి మీతో కరచాలనం చెయ్యలేం. ఏమయినా మనదారులు చీలిపోయాయి. మీదారి మాదికాదు. మాదారికి మీరురారు. సరే అంతా సక్రమంగాజరిగితే వచ్చేయేడు విరసం సభల్లో కలుద్దాం అందాకా గుడ్‌బై, విప్లవం వర్ధిల్లాలి. విరసం వర్ధిల్లాలి, అమర వీరులకు జోహార్.

[గుంటూరులో జరిగిన విరసం తృతీయ మహాసభల్లో
15 అక్టోబర్ 1972 న చదివిన ప్రసంగ వ్యాసం]

సాహిత్య వ్యాసాలు III

మన రచయితలు — (1914)

గోర్కీ

తమ తమ ఆనందాలను, అనుభూతులను, ఆలోచనలను అందంగా చెప్పాలనే తపన అందరికీ ఉంటుంది. పాటకజనంలో వికాసంతోపాటు ఈ తపన మరింత పెరుగుతుంది. ఒంటరిగానూ, కలిసికట్టుగానూ కూడా వాళ్ల జీవితాన్ని విడమర్చి చెప్పగలరు. కళ్ళకు కట్టగలరు.

గుండె పొంగిపొరలిపోతున్నప్పుడు తన సుఖదుఃఖాలను అది మనుషుల్లోకి, వారి మనసుల్లోకి ప్రవహింపజేస్తుంది.

పాటకజనం తమ సాహిత్యం తామే సృష్టించుకుంటారు. అందుకోసం ఎంత కృషి, ఎన్ని త్యాగాలయినాసరే చేస్తారు.

కార్మికులు, కర్షకులు ఎన్నోఏళ్ళనుంచి, ఎంతో పట్టుదలతో తమ ఆలోచనలు, అనుభవాలు, ఉద్రేకాలు పుస్తకరూపంలో ప్రకటించాలని గట్టిప్రయత్నం చేశారు.

యువతరానిది సున్నితమైన హృదయం. నిశితమైన మేధస్సు. సామాజిక ఆదర్శాలకు స్పందించి అన్యాయాలను యెదిరిస్తారు.

రచయిత వీలైనన్ని ఎక్కువ సంగతులు తెలుసుకోవాలి. ప్రతి ఒక్క సంగతీ తెలుసుకుంటే మరీ మంచిది. తనుచూసి తెలుసుకుని, అనుభవించిన ఎన్నెన్నో సంగతుల్లోంచి చిక్కనైన విషయాలను, విశ్వజనీనమైనవాటిని మాత్రమే ఎంచుకుని, కేవలం వ్యక్తిగత సంకుచిత సంగతులను వదిలివేయాలి. అలా ఎంచుకోడంద్వారా రచయిత కళాత్మక, సామాజిక రచనలు రాయగలుగుతాడు. ఒకవేళ వ్యక్తిగత, సంకుచిత విషయాలను వదిలివేయకపోతే సామాజిక, వైజ్ఞానిక విలువలులేని ఉదంతాలు మాత్రమే రాయగల్గుతాడు. మానవుల్లో అనుభూతి రగిలించి జీవితంపట్ల వారికో దృక్పథాన్ని కలిగించడమే కళ ప్రయోజనం. 'కళ కళకోసమే' అనేవాళ్లు పైకి ఎన్నికబుర్లుచెప్పినా వారికి సామాజికదృష్టి బొత్తిగా ఉండదు.

రచయితపని చాలా కష్టమైంది. ప్రజలగురించి కథలురాయడం అంటే రాట్నం వడకటంలాంటిదికాదు. పెన్సిల్‌తో రేఖాచిత్రం గీసినట్లు, కుంచెతో బొమ్మవేసినట్లు, మాటలతో మనుషులను చిత్రించాలి. ఇలా చిత్రించడానికి మంచి ఒడుపు, నైపుణ్యం

కావాలి. సంగతి సందర్భాలు, మనిషి మంచిచెడ్డలు బాగా తెలిసుండాలి. వీటన్నిటిని మాటలతో ఎంతో వివరంగా వర్ణించి అచ్చుకు అక్షరాలకు అతీతంగా ఆ మనిషిని కాగితాలమీద కళ్ళకుకట్టినట్లు చూపించాలి, చదివేవాడికి వాస్తవిక అనుభూతికలగాలి.

రచయితకు, పాఠకుడికి మధ్యమంచి జతకుదిరినప్పుడే నిజమైన సాహిత్యం పుడుతుంది. మానవహృదయంలో ఇమిడే అనుభవాలన్నింటిని రంగరించిపోయడమే రచయితపని. జీవితంలోని మంచిచెడులు, సుఖదుఃఖాలు, హేళన, హేయం వీటన్నిటిగురించి మిశ్రిసమ్మిశ్రతంగా చెప్పినప్పుడే పాఠకుడు బాగా అర్థంచేసుకుంటాడు.

జీవితం అట్టడుగునుంచే రచయితలురావాలి. పాటకజనాన్ని మనం గౌరవించాలి. ఎందుకంటే నాగరికప్రపంచం గర్వపడే విలువలన్నిటికి సృష్టికర్తలు ఈ పాటకజనమే. ఆజాతి రచయితలనే మనం మరీమరీ ప్రోత్సహించాలి. వాళ్ళనెప్పుడూ అంటిపెట్టుకుని ఉండాలి మనం. రాయాలనే తపన వాళ్ళల్లో ఉన్నప్పుడు రాసేతీరు. శిల్పం వాళ్ళకు అబ్బేలా చేయడం పెద్ద అబ్బురమేమీకాదు. అందుకు మనం బాగా దోహదంచేసి, పాటకజనంలోంచి వచ్చే రచయితలకు నివాళిపట్టాలి.

అను: సి. ప్రసాద్

కళ

మే ఆఖరివారంలోనే వెలువడవలసిఉన్న 'కళ' 5వ సంపుటి అక్టోబర్ మొదటి వారంలోగానీ వెలువరించలేకపోయినందుకు చింతిస్తున్నాం. 'కళ' కొరకు M. O. లు చేసిన వారందరికీ అక్టోబర్ మొదటి వారంలో కాపీలు పంపబడినాయి. ఎవరికైనా అందిఉండకపోతే ఒక కార్డుద్వారా తెలియపర్చ గోరుతున్నాం.

'కళ' వెల రు. 5/- సృజన పాఠకులు "సృజన" నుండి రు. 2-50 లకే పొందవచ్చును.

ప్రచురణకర్తలు:

భారత్ కళా పరిషత్

70/2 RT, ప్రకాశంనగర్: హైదరాబాద్-500016

12

విప్లవ సాహిత్యోద్యమం - కథలు II

మరువాడ రాజేశ్వరరావు (గత సంచిక తరువాయి)

ప్రలోభాలకి కారణం ప్రలోభపెట్టేవాళ్ళే అయినా, ప్రలోభపడడం అనేది ఆ వ్యక్తి మానసికస్థితిమీద ఆధారపడి ఉంటుంది. పట్టెమంచంమీద పెద్ద బొజ్జగాడితో పడుకోవాలనే ప్రలోభం పేదవాళ్ళందరికి కలుగుతుందనుకోను. ఎవరికేనా ఒకవేళ కలిగినా, అది పిచ్చికింద ముదరాలంటే విపరీతమైన మానసిక బలహీనత కారణం కావాలి. ఆ బలహీనత సామాజిక సమస్యకాదు. జంపన పెద్దిరాజు, 'మంచం' కథలో ఈ బలహీనతని సెంటిమెంటుగా వాడుకుని ప్రాధాన్యత యివ్వడం జరిగింది. 'కావేటి' పాత్రమీద ఏ విధంగానూ సానుభూతి కలగడానికి అవకాశంలేదు. కావేటికి మొగుడి మీద పేమకన్నా, భద్రియ్య డబ్బుమీద, సిల్కుచొక్కాలమీద, అతని యింట్లో ఉన్న 'మంచం'మీద అభిమానం ఎక్కువ.

ఇదే కథలో మరోకథవుంది. భద్రయ్య అతని కొడుకు కలిసిచేసిన దౌర్జన్యానికి బలైపోయిన కోటయ్యకథ. కోటయ్య చావు చావుతోటే అంతమైపోదు. కాని ఈవిషయం రచయితకి తట్టలేదు. 'కావేటి' పాత్రకి యిచ్చిన ప్రాముఖ్యత కోటయ్య పాత్రకి యివ్వలేదు.

చైతన్యం అంటే ఏమిటి? చైతన్యంకలిగిన జనం ఎలా ప్రవర్తిస్తారు? ఈప్రశ్నలకి సమాధానం 'చైతన్యం' కథ. చైతన్యవంతులైన జనం మధ్య ఐకమత్యంతోనూ, ఆత్మీయతతోనూ, కలిసికట్టుగా చేసుకున్న దృఢనిశ్చయంలోనూ పైప్రశ్నలకి సమాధానం దొరుకుతుంది.

మాలపల్లిలో జనం 'రెక్కలు ముక్కలుజేసుకుని కష్టపడతన్నారు. ఏవిలాభం? పప్పుంటే వుప్పుండదు ఉప్పుంటే పప్పుండదు'— వాళ్ళ కాలేకడుపుల్లోంచి కరిగే రెక్కల్లోంచి, జాలినిండిన కంటిపాపల్లోంచి, మమతనిండిన మంచి మనసుల్లోంచి రేపటిమీది ఆశతో, అందరి గుండెల్లోనూ పెల్లుబికిన చైతన్యం— అది విప్లవ చైతన్యం!

"మనం లేకపోతే వాళ్ళెవరు?"అని లక్షాధికారుల్నిగురించి ప్రశ్నించిన చైతన్యం.

"అళ్ళని లచ్చాదికారుల్నిజేసి మనం వాణ్ణం మెతుకులికి మొకంవాసిపోతన్నాం" అని తెలుసుకున్న చైతన్యం....

"కరమంలేదు గిరమంలేదం"టూ కార్యరంగంవేపు కాలుచాచిన చైతన్యం....

కొల్లగొట్టింది ఒక్క లారీనే. అందరూ కలిసి పంచుకున్నవి బియ్యం బస్తాలు మాత్రింకాదు ... ఆవేశం, ఉత్సాహం, రేపటిమీది ఆశ, ఒక్కమాట, ఒకే బాట!

'ఐకమత్యంతో చేసిన ఏ పనైనా విజయవంతంగా జరుగుతుందని ఆ నిరుపేదలు అనుభవంలో తెలుసుకున్నారు....'

వాళ్లు పంచుకున్నది నమ్మకం. ఆదర్శం సాధించుకునేందుకు చేసుకున్న కట్టుబాటు.

పోలీసులెంతగా హింసించినా, "ఆ బాదేదో ఆవొక్కడే పడాలి గాని మన గుట్టుమాత్తరం జెప్పకూడదు" ....

ఆ చైతన్యం ఆ ఒక్కఊళ్ళోనే ఆగేది కాదు. ప్రాణవాయువులాగ, సూర్యకిరణాల్లాగ ఊరూరా ప్రవహించి ఒకరోజు వెల్లువై పొంగుతుంది.

విప్లవ చైతన్యాన్ని అర్థంచేసుకున్న కథ 'చైతన్యం'. విప్లవ చైతన్యాన్నందజేసే కథ 'చైతన్యం'!

మంచితనం, త్యాగం, న్యాయం, ధర్మం, శాంతి, అహింస, స్వాతంత్ర్యం మొదలైనపదాలకి అర్థాలు ఈ సమాజంలో వేరుగా చలామణీ అవుతున్నాయి. సమాజం నడిచే తీరుని కొంచెం లోతుగా పరిశీలిస్తే, పై పదాలు ఏ స్వరూపాల్లో చలామణీ అవుతున్నాయో అర్థమౌతుంది. ఈ దొంగస్వరూపాన్ని బైటపెడుతూ, అసలు స్వరూపాన్ని పాఠకుడి భావనకి అందుబాటులోకి తెస్తూ కథలు రాయొచ్చు. అటువంటి కథల్లో యన్. యస్. పత్రికాశరావు, 'మంచి'కథ ఒకటి.

'విద్యానిధి' శిష్యుడు 'అమాయకుడు'అనేవాడు, మంచిని పెంచుతానని గురువుగారికి మాట యిచ్చినప్రకారం ప్రయత్నాలు ప్రారంభించేడు: అతను గాంధిగారిలాంటి రాజకీయవేత్తకాదు కనక మంచివాళ్లదగ్గరికే వెళ్ళి, 'నాయనా, ఒరే, బాబూ మంచిగా ఉండండర్రా'అనలేదు. అమాయకుడు కనక దుర్మార్గుల దగ్గరికే వెళ్లి నయానచెప్పేడు, బతిమాలేడు. జాలితో గుండెలు కరిగిపోయేలాగ పాటలు పాడేడు. ఎన్ని చేసినా దుర్మార్గులు మంచికి మారలేదు. మంచిని నిలబెట్టేందుకు మంచివాళ్లంతా దుర్మార్గులమీద తిరుగుబాటుచేసి దుర్మార్గుల్ని దండించవలసిందేనని అతనికి జ్ఞానోదయం కలుగుతుంది.

'చిరంజీవి' కథలో, 'రాంబాబు' చిరంజీవి, అతనికి సాహిత్యం తెలుసు. రాజకీయ సిద్ధాంతాలు తెలుసు. వాటికి తోడు అపారమైన లోకజ్ఞానం ఉంది. అతను బుర్రకథలు చెప్తే జనం పరవశించి పరవళ్లు తొక్కేవారు. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని

కోరి ప్రాణాలు తెగించి పోరాడే వ్యక్తి. అతను పద్నాలుగేళ్ళ పసివాడే. కాని అతన్ని చూస్తే అధికారులకి వొణుకు. అతన్నిచూస్తే సామాన్యప్రజలకి అంతులేని అనురాగం. అభిమానమూను! ఆదర్శం కోసం ప్రాణాలే త్యాగం చెయ్యగల చిరంజీవి రాంబాబు అతని మాటలకి పోలీసుల కరకుగుండెలుకూడా కదిలేయి. అతని చూపులు ప్రతిపేద వాడి గుండెల్లోనూ చైతన్యం వెలిగిస్తాయి. కాని అధికారం అతనిమీద తుపాకీకాల్చింది. అయినా అతను చావలేదు. ప్రజల గుండెల్లో యెప్పటికీ అతను చిరంజీవే. అతను ప్రాణాలు వదిలి పోలీసు రామ్మూర్తి గుండెల్లో వెలిగేడు.

'సూర్యుడు'కథలో సూర్యం ఒక నక్సలైట్. అతనివెంట యెప్పుడూ నీడలాగ సి.ఐ.డీ లుంటారు. అందువల్ల 'మిత్రు'లకి అతనంటే భయం. 'ఇంకా తనలాంటి కోట్లాది ప్రజలకి నిజమైనస్వేచ్ఛ రావాలనే పోరాటం'లో, 'ఎన్నో రాత్రులు ఆశ్రయం లేకుండా, తిండిలేకుండా' గడుపుతాడు. పోలీసుల చేతిలో చిక్కినప్పుడు భరించరాని హింస భరించేడు. 'సంపద అసలు సృష్టికర్త కార్మికుడు—రైతు తరతరాలుగా నికృష్టం గా జీవిస్తుంటే, వాళ్ళకు నిజమైనఅధికారం ఎప్పుడువస్తుందా అని కలలు కన్నాడు'.... కలలు నిజంచేసేందుకు ప్రాణాలొడ్డి పోరాటంలో చేరేడు. 'వియత్నాం పోరాటంలో వియత్కాంగ్ గెరిల్లాల సాహసిక చర్యలు' అతనికి ఆదర్శాలు. అతను ఆదర్శంకోసం ఆత్మత్యాగంచేసిన మరో చిరంజీవి. మరణించేకకూడా అతను 'మండుతున్నసూర్యుడు'!

చిరంజీవి, సూర్యుడు కథలు పరిపూర్ణ రాజకీయ చైతన్యం సాధించగలిగే త్యాగా న్ని, ఔన్నత్యాన్ని నిరూపిస్తాయి.

శ్రీపతిగారి 'నర్తోడు'కథ రాజకీయ సిద్ధాంత పరిజ్ఞానంలేని ఒక పేదరైతు కూలి, జీవితంలోని హింసని ప్రతిహింసతో ఎదుర్కొన్నప్పుడు, ఆ క్రియతాలూకు ప్రభావం జనంలో ఎటువంటి చైతన్యం కలగజేస్తుందో వివరిస్తుంది.

నర్తోడు గుర్రాల ప్రకాశంనాయుడి కంబారి. 'వూళ్లో పెద్దలకీ, గుర్రాలప్రకా శం నాయుడికి ఎలక్షన్లలో గొడవకొచ్చేయి. ఆ వూళ్లో ఒంటరివాడైపోయేడు'—అతని కంబారి నర్తోడంటే అందరికీ లోకువే!

తామాడ సుగ్రీవు 'తండ్రికి వెధవప్పజెల్లెళ్ల ఆస్తి పదెకరాలు, బంగారం ముప్ఫై నలభై తులాలు, డబ్బు పది పదిహేనువేలు, ఇళ్లు రెండు కలిసాయి'— తామాడ సుగ్రీవు కొరడా ఝళిపించగలడు. ఆ కొరడాకూడా అనువుగా దొరికిన నర్తోడిమీదనే ఝళిపిస్తాడు.

అయితే ఎప్పటికీ ఆ జులుంనీ, అధికారాన్ని నర్సోడు మౌనంగా భరిస్తూ ఉంటాడా? ఆ రోజు తిరగబడ్డాడు. తిరగబడే చైతన్యం ఊళ్ళో పసులకాపర్లకి, కంబార్లకి కథా వస్తువైంది.

దెబ్బలు తిన్న తామాడ సుగ్రీవు కిక్కురుమనకుండా ఊరుకోడానికి కారణాలు తెలీవు. పేదవాళ్ళలో చైతన్యం ఎంతగా ఎక్కువైతే పెద్దవాళ్లు దాన్నంతగా అణచడానికి ప్రయత్నిస్తారు. అటువంటి దమననీతిని మరింత చైతన్యంతో ఎదుర్కోవడం జరుగుతుంది, రియాక్షన్ (Reaction) లేకపోతే సోషలిజం 'దానంతటదే వచ్చేస్తుంది' మరి!

ఈ వ్యాసంలో పరిశీలించిన వాటికన్న చాలా ఎక్కువగానే విప్లవ కథలు వచ్చేయి. ఈ కొన్నికథలూ విప్లవకథాస్వరూపాన్ని న్యాయంగానే ప్రతిబింబిస్తాయనుకుంటున్నాను. ఈ కథల్లో ముఖ్యంగా గమనించతగ్గ విషయం. కథావస్తువు జీవితాన్నే అంటిపెట్టుకోవడం. ఈ కథలవల్ల కలిగే ఆలోచనల్లో నేల విడిచి సాము చెయ్యడం, కలలు కనడం అనేవి ఉండవు. జీవితంలోని పచ్చి నిజాల్ని యథాతథంగా చూపించి పాఠకుడిని కలవర పెడతాయి. ఏంచెయ్యాలోకూడా సూచిస్తాయి. జీవితంలో ఎంతో వైవిధ్యంఉంది. ఆ వైవిధ్యాన్నంతా విప్లవ కథకులు సాహిత్య రూపంలో చిత్రిస్తున్నారు.

'కవిత్వానికి ప్రబోధించే గుణం ఉంది.' కథ పాఠకుడితో కలిసికూర్చుని ఆలోచిస్తుంది; చర్చిస్తుంది; పాఠకుడి బుద్ధికీ హృదయానికీ లంకెవేసి, ఈ ప్రక్రియని విప్లవ కథకులు నేర్పుగానే వాడుకుంటున్నారు. ఈ రోజు ఉద్యమరూపం తీసుకున్న తెలుగుకథ రేపు మరింత బలంగా పెరుగుతుందనడానికి సందేహంలేదు.

కథ

భరా(త)సంస్కరణ

వాసిరెడ్డి మోహనరావ్

అనగా అనగా ఒకానొకకాలంలో ఒకరాజ్యం వుండేది. ఆ రాజ్యాన్ని ఒకానొక రాజుగారు పరిపాలిస్తుండేవారు. రాజుగారి పరిపాలన ఒట్టి మంత్రుల మంత్రాంగంతోనే కాకుండా సైనికాధిపతుల కత్తుల పదునుతోకూడా నడుస్తూండేది.

కొన్ని సంవత్సరాలుగా దేశంలో కరువు ఏర్పడ్డంచేతనూ, రాజుని పడగొట్టి సింహాసనం అధిష్ఠించాలని రాజకుటుంబంలోవారే కొందరు ప్రయత్నించటంవల్లనూ, రాజుగారు విలాసాల్లో తేలి ప్రజలగురించి, పరిపాలనగురించి ఏమీ పట్టించుకోకపోవటం చాతనూ, దేశంలో దరిద్రం ఏర్పడి అందుమూలంగా అరాజకం యేర్పడింది. ప్రజలు ఒకచోటనుండి మరొకచోటికి వలసపోయేరు. దారిదొంగలు విపరీతంగా పెరిగిపోయేరు. ప్రజలు ఆకలితో చచ్చిపోయేరు. చావనివాళ్ళు కొందరు చావుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. మరికొందరు మాత్రం చావు ఎలాగూ వస్తుంది కనుక తిరుగబడి చనిపోవటంమేలని తిరుగబడ్డారు. అక్కడో శిస్తులువసూలుచేసే కరణాన్నీ ఇక్కడో 'శాంతిభద్రతలు' కాపాడే పటేలునీ, అక్కడెక్కడో ఒకపర్దారునీ, ఇంకెక్కడో యినప్పెట్టెనిండా డబ్బూ గాదెనిండా ధాన్యమూ నిలువచేసిన వణిక్ప్రముఖుణ్ణీ తిరుగబడ్డ జనం చంపినట్లు రాజధానికి వార్తలొచ్చేయి.

పల్లెటూళ్ళలోవుండే కామందులూ, రాబందులూ, షావుకార్లు, ధనికరైతులు, యింకా కరువుదెబ్బ తగలనివాళ్లు యావన్మందీ చావంటే భయంలేక తిరుగబడిన ప్రజల వలన కలిగిన చావుభయంతో నగరాలకు వలసవచ్చేరు.

దేశంలో అరాజకం ఏర్పడి, యెందరో చావంటే భయపడేవాళ్ళూ, కొందరు చావంటే భయపడనివాళ్ళూ చచ్చింతరువాత రాజుగారు కళ్ళుతెరచి మంత్రిగారిని యిలా అడిగేరు "అమాత్యశేఖరా! ఈ తిరుగుబాటువార్తలు యదార్థమేనా? మాకు చాలా ఆందోళన కలిగించుచున్నవి. నిజంగా ప్రజలకు పండ్లూ పాయసాలు కాకపోయినా, ఓరొట్టెముక్కైనా దొరకటంలేదా?" ప్రక్కనే కూర్చున్న ముద్దులతనయ యువరాణి వారితలను నిమురుతూ, ఆ యువరాణి "రొట్టెలేకున్నచో కేక్ ఏల తినరాదు?"అని పృచ్ఛించలేదు. ఆమె పెంపుడుపక్షితోక ఈకలు అతిశ్రద్ధగా గమనిస్తూ వుండిపోయింది. రాజుగారి కొడుకు యువరాజా వారు ఏదో పటాన్ని పరిశీలిస్తూ మరోవేపున ఆశీనులై వున్నారు.

యువరాజో చాలాదూర దేశంపోయి రథాలమీదా, యింకా యితర వాహనాలమీదా ఎంతో తర్ఫీదుపొంది మరెంతో నేర్చుకుని ఈమధ్యనే తిరిగివచ్చేరు. ఒకానొక కొత్తరకంరథం యొక్క నమూనాని తయారుచేసి, రాజుగారి అనుమతితో, ప్రజలడబ్బుతో రథాలు తయారుచేసే కార్ఖానాను నెలకొల్పి దేశంలో వణిక్ప్రముఖులూ, పండితులూ ముఖ్యంగా యువవణిక్ప్రముఖులూ, యువపండితులూ, యువరాజ వంశీకులూ రథాల కొరతవల్ల పడుతున్న బాధనుతీర్చ సంకల్పించారు. ఆదేవిషయమై తీవ్రంగా ఆలోచిస్తూవుండటం వల్లి యువరాజావారు మహారాజావారు మహామంత్రిగారిని అడిగినప్రశ్న వినలేదు.

రాజవంశంలో కుట్రలూ కుహకాలూ లేకపోతే, ఇప్పుడేమీ రాజకీయాల్ని గురించి పట్టించుకొనకపోయిననూ యువరాజే భవిష్యత్తులో ఆ దేశానికి రాజుఅవుతాడని కొందరికి తెలుసు.

రాజుగారు అడిగినప్రశ్నకు అమాత్యులవారు "నిజమే ప్రభూ। ఈవార్తలు మీకు విన్నవించి ఆందోళన కలిగించుట నాకిష్టములేకపోయినది. తిరుగబడిన ప్రజలవివరాలు సేకరించటానికి చారుల్ని రాజ్యంలో నలుమూలలకీ, పేటపేటకీ, వీధివీధికీ పంపేను. తిరుగబడ్డ ప్రజలను నరికి పారెయ్యడానికీ, తిరుగబడని ప్రముఖులను రక్షించడానికి యాభైపటాలాల సైన్యము పంపితిని. దుండగులు కనిపిస్తే నరికెయ్యమన్నాను. కనిపించకపోతే పేదవాళ్ళపేటలు, గుడిసెలు కాల్చెయ్యమన్నాను. విజయవార్తలు యింకొద్దినాళ్ళలో రావచ్చునని తెలుస్తోంది" అన్నారు.

రాజుగారు మంత్రిగారి సామర్థ్యమునకూ తెలివితేటలకూ ఎంతయున్ సంతసించి నిశ్చితంగా నుండిరి.

* * *

నెల గడిచింది. రెండు నెలలుగడిచినవి, మూడునెలలు దాటిపోయేయి. రాజుగారికీ, అమాత్య శేఖరుడికీ. యింకా యితర రాజ వర్గానికి ఆందోళన పట్టుకుంది. వున్నకుందీ ఆందోళన భయంగా మారింది.

సైన్యమూ, చారులూకూడా దేశంలో నలుమూలలకీ వెళ్ళి తిరుగుబాటు దార్లని కొందరిని క్రూరంగా వధించేరు కాని తిరుగుబాటు తిరోగమించలేదు. అదింకా రాజుతూనేవున్నది.

రాజుగారికి ఏమిచేయాలో పాలుపోయిందికాదు. సైన్యాన్ని పంపి, వాళ్ళకు కావలసినన్ని అధికారాలిచ్చి చేయగల్గింది చేసేరు. కాని తిరుగుబాటుమాత్రం యింకా రగులుతూనేవుంది. రాజ్యంలో ధనవంతులకి రక్షణలేకపోయింది. వాణిజ్యవేత్తలూ, రాజవంశ ప్రముఖులూ, ధనికులూ, భూస్వాములూ రాజుగారిదగ్గరకొచ్చి మొరపెట్టు

కున్నారు. వాళ్లు గోడుగోడునఏడుస్తూ యిలా విన్నవించుకున్నారు. "ఘనతవహించిన మహాప్రభో! మమ్మల్ని రక్షించు! మా ప్రాణాల్ని, మా డబ్బుని, మా పిల్లల్ని, మా పెళ్లాల్ని రక్షించు! రక్షించు! ఎట్లా అణుస్తావో, కత్తితో అణుస్తావో, కలంతో అణుస్తావో, మరి ఏదైనా మాయామంత్రించేసి అణుస్తావో కాని యీ తిరుగుబాటును అణిచెయ్యి! లేకుంటే మాకేకాకుండా భగవంతుని స్వరూపమైన మీకూ, మీ అధికారానికీకూడా ఆఖరుదినాలు వచ్చినట్లేలెక్క".

రాజుగారు వారందరి మొరనీ ఆలకించి "మేము ఆలోచించి తగుచర్యలు తీసుకొందుము. మీకు తప్పక రక్షణ కల్గించుదుము" అని అభయమిచ్చి వారిని సాగనంపిరి.

◆ ◆ ◆

ఆరోజు రాత్రి రాజుగారి రహస్య మందిరంలో రాజు, రాజు తమ్ముడు, రాజు బావమరిది, సైన్యాధ్యక్షుడూ, మంత్రులు, సామంతులూ, కోటీశ్వరులూ సమావేశమయ్యేరు. అందరూకూడా ఏమీ దిక్కుతోచక రాజుగారు ఏమిచెప్తారో విందామని కుతూహలంగా, దీనంగా, విచారంగా కూర్చునేరు.

రాజుగారు అంతఃపురకుట్రల్నీ, తనను పదవీభ్రష్టుడ్ని చేయాలని కోటలోనూ, వెలుపలా జరిగే కూహకాల్నిగురించి ఆపూటకి ఆలోచించటం మానేసేరు. రాజవంశ ప్రముఖులూ, కోటీశ్వరులూ అంతాకూడా ముందు సింహాసనం క్షేమంగావుంటే తామూ క్షేమంగా వుంటామనీ, ఆ సింహాసనంమీదా తామైనా, మరొకరైనా తమవర్గంవాడే వున్నంతకాలం తమకి ముప్పులేదనీ, అసలుముప్పు తిరుగబడ్డ ప్రజలనుంచనీ తెలుసుకున్నవారై, తమ సంపూర్ణ సహాయాన్ని రాజుగారికి తిరుగుబాటును అణచేందుకు (మాటిస్తే)ఇచ్చేరు.

రాజుగారు ఈరోజుతో ఈ తిరుగుబాటు సమస్యను అటో యిటో తేల్చిపారెయ్యాలనుకున్నవారై యిటనిరి "అమాత్యశేఖరా! ఇంతకుముందు మా తండ్రిగారికాలంలోను భయంకరమైన క్షామం వచ్చి ప్రజలు చనిపోయారు. కాస్తో కూస్తో అల్లర్లు, తిరుగుబాట్లు జరిగినై. కాని యిప్పటివలె అవి ఎక్కువకాలం నిలువలేదు. దీనికికారణం ఏమైయుండనోపు? సెలవియ్యండి" సమస్య నివృత్తిచేసుకొనదలచినవారై అడిగిరి.

మహామంత్రిలవారు అర్ధనిమీలిత నేత్రుడై అరక్షణంసేపు ఆలోచించి ఇట్లనిరి, "ప్రభూ! మీరు సెలవిచ్చినట్లు ఇంతకుముందు కరువుకాటకాలు వచ్చినవి. చెదురుమదురుగా అల్లర్లూ, తిరుగుబాట్లూ జరిగినవి. అవి విజయవంతముగా అణచివేయబడ్డవి. కావి యిప్పటికీ, ఆకాలానికీ ఒక్కతేడావుంది. ఇప్పుడు ప్రజలనుంచి మనం వసూలుచేసే పన్నులు పెరిగాయి ప్రజలు చాలామంది తమకున్న కొద్దిపాటి భూములనూ

అప్పులుచేసి తీర్చలేక వడ్డీవ్యాపారస్తులకి పోగొట్టుకున్నారు. నగరకర్మాగారాల్లో కూలీలకిచ్చే వేతనం తగ్గటంవలన దారిద్ర్యం పెరిగింది. చదువుకున్నవారికి వుద్యోగాలూ, ఆదరణాకరువై భూమిలేని నిరుపేదలు అధికమయ్యారు. ఇది కేవలం కరువుకాటకాల్లో వచ్చిన కరువుకాదు " మహామంత్రి రాజుకి విషయాన్ని విడమర్చి చెప్పవలసినవాడై, కొంతైనా చేదునిజం చెప్పకతప్పిందికాదు.

వెంటనే రాజుగారు "అయినచో కూలీలవేతనం ఏల పెంచరాదు? పేదలకు వడ్డీవ్యాపారస్తులు ఎందుచేత భూమి తిరిగి యివ్వరాదు?" అని అడిగిరి. అంతట నచ్చట యున్న వస్త్రపరిశ్రమాధిపతియూ మరియింకఅనేకవస్తు వాహనముల పరిశ్రమల కధిపతియూనైన ఒక కోటీశ్వరుండిట్లనియె.

"ఘనతవహించిన మహాప్రభూ! కూలీలవేతనములు పెంచినచో మాలాభములు తగ్గిపోవును. మా లాభములు తగ్గినచో మీకు మేము దండిగా బహుమానములిచ్చుటెట్లు? మీ కోశాగారమును, మీ విలాసఖర్చులు, సైన్యమునకగు ఖర్చులు ఏ విధముగ సరిపోవును? మరల మీరు ప్రజలపై పన్నులు అధికము చేయవలె. ప్రజలు మరల తిండిలేక తిరుగుబాటుచేయుదురు. అందుచేత వేతనములు పెంచపనిలేదు. తమరే దీనికి వేరువుపాయము నాలోచింపవలె"ననిరి.

ప్రముఖ వడ్డీవ్యాపారియూ, అనేక లక్షల బంగారునాణెముల కధిపతియునైన శ్రీమంతుడులేచి యిట్లనెను. "రాజాధిరాజా! మీరే యిట్లన్నచో మా కింకెవ్వరుదిక్కు? మేము స్వాధీనముచేసుకొన్న యిళ్ళు. భూములు. సంపదలు అన్నియుతిరిగి పేదప్రజలకిచ్చివేసినచో మేమును నిర్భాగ్యులము కావలయునుగదా! అదియే ప్రభువుల సెలవా?" యని కించిత్ నిష్ఠూరముగా పలికిరి.

అందుకు రాజు మిక్కిలి బాధపడ్డవాడై వారినుద్దేశించి యిట్లనెను. "ప్రముఖులు శాంతించవలెను. మేమిన్నినాళ్ళు కేవలం అంతఃపురగొడవలలోను, విలాసములలోను మునిగియుండుటచేత మాకు విషయములు సరిగా తెలియకపోయినవి. నేను యవివేకముతోనన్న మాటలకు మన్నింతురుగాక! నన్ను నమ్ముకున్న మీకు కీడెంచు తెలివితక్కువవాడనుగాను. మీ క్షేమము, మీ బాగు నాకు మిక్కిలి కావలసియున్నవి మీరు చెప్పవలసినది సెప్పియుండుటచేత ఇక మీరు వెళ్ళవచ్చు. మీరు నిశ్చింతగా యుండవచ్చు. మేమే ఈరాత్రికి ఏదోవొక గట్టి నిర్ణయము తీసుకొందుము"అనిరి.

ప్రముఖులు భారమంతయు రాజుపైవేసి నిశ్చింతగా వెళ్ళిరి.

రాత్రి చాలా ప్రొద్దుపోయింది. అంతఃపురం సద్దుమణిగింది. రాజుగారింకా మేలుకొని ఉద్యానవనంలో పాలరాతి అరుగుమీద కూర్చుని వున్నారు. రాజు మనసు చాలా ఆందోళనతోను, అనేక ఆలోచనలతోనూ యున్నది. రాజు యీ రాత్రి ఒక్క చుక్క మద్యమునైనను ముట్టలేదు. రాజనర్తకి మాలినీదేవిని కన్నెత్తిచూడలేదు. రాజుకి కళ్ళుతెరచినా మూసినా మహాజనసందోహం కనిపిస్తోంది అల్లరి, తిరుగుబాటై. తిరుగుబాటు విప్లవంగామారితే యింకేమిగతి తనకు? అని రాజు బాధపడ్డాడు. మహామంత్రిగారు మహారాజును కనిపెట్టుకుని పక్కనే కూర్చున్నారు. వారున్నూ అత్యంత విషాద సముద్రములో మునిగి అతితీవ్రముగా ఆలోచిస్తున్నారు.

రాజుగారు రాజ్యానికొచ్చి అట్టేఏళ్ళుకాలేదు అలా అని ఆయన కుర్రవాడుకాడు. మధ్యవయసుకూడా దాటిపోయింది. నిన్న మొన్నటి వరకు రాజు తండ్రి రాజ్యాన్ని రాజాధిరాజై ఏలి ఇటీవలనే కాలంచేసేరు తండ్రి రాజుకి ముందారాజ్యాన్ని 'అంగిశేయ'రాజ్యంవారు ఎప్పుడో దండెత్తివచ్చి లోబరచుకుని పాలించేరు. కాని రాజ్యంలో రాజవంశంవారున్నూ ధనికశ్రేష్ఠులున్నూ 'అంగిశేయ' రాజ్యంవారి మూలాన తాము అధికలాభములు, ఆధికసంపాదనలు రాబట్టుకోలేకపోవుచున్నామని తలచినవారై, ప్రజలను రెచ్చగొట్టి వారి కోపతాపములు తమకనుకూలముగ మార్చుకుని, 'అంగిశేయుల'కు చికాకు కలిగించసాగిరి. 'అంగిశేయులు'తామాదేశాన్ని వదలిపెట్టి వెళ్లుట తప్పదని తెలుసుకొన్నవారై రాజ్యాన్ని శక్తివంతుడయిన రాజుకి అప్పజెప్ప నిశ్చయించుకుని, అట్టి రాజుకొరకు వెదుకసాగిరి. అప్పుడొక మహాముని- ప్రజల తిరుగుబాటును అహింసాయుతముగానడిపి 'అంగిశేయుల'కు ప్రేమపాత్రుడైనవాడు- ముందుకువచ్చి, తండ్రి రాజును తీసుకొచ్చి, ఇదుగో సిసలైన రాజవంశంవ్యక్తి. రాజ్యాన్నితనికి అప్పజెప్పండి. సింహాసనమును శక్తిసామర్థ్యములతో ప్రజలనుండి రక్షించగలడనెను. 'అంగిశేయు'లందుకు సమ్మతించి రాజ్యాన్ని వదలివెళ్ళిరి.

అదీకథ. ఈ కథవయసు పాతిక సంవత్సరాలు. విచారంగా ఆలోచిస్తూ కూర్చున్నరాజుగారికీ పూర్వకథ యావత్తూ యెందులకో గుర్తుకొచ్చింది.

ఆయనకు వున్నట్టుండి మెరుపులా మరొకటికూడా గుర్తుకు వచ్చింది. రాజు వెంటనే మంత్రికేసి తిరిగి యిట్లనిరి "మహామంత్రీ! మా తండ్రిగారి కాలంలోనూ తిరుగుబాటు వచ్చిందికదా? కాస్తంతతక్కువమోతాదులో. కాని తిరుగుబాటు విప్లవంగామారకుండా మా నాన్నగారు విజయవంతంగా అణిచేసేరుకదా? ఎలా అణిచేరు? ప్రజలకు మాటలుచెప్పి, నిద్రపుచ్చి, జోకొట్టి, వాగ్దానాలిచ్చి, ఆశలుచూపి అణిచేసేరు. అవునా? మరందుచేత మనమిప్పుడు అటువంటిపనే మరొక్కటి చెయ్యవలెను. నా మనంబు

కొక్కటి తోచుచున్నది. శ్రద్ధగా ఆలకింపుడు. భూమిలేనివారికి భూమియును, తిండి లేనివారికి తిండియును, పనిలేనివారికి పనియును తప్పక యిచ్చెదమని రాజ్యమంతా రోజూ ఉదయమూ, మధ్యాహ్నమూ, సాయంకాలముకూడా దండోరావేయించవలెను. తప్పకుండా తిరుగుబాటు విప్లవముగా సమీప భవిష్యత్తులో మారకుండునని మానమ్మకం"

*　　　　*　　　　*

రాజుగారి మనుషులు దేశంయొక్క నలుమూలలకీ వెళ్ళి "భూమిలేనివారికి భూమియును, తిండిలేనివారికి తిండియును రాజుగారు కల్పించెదరహో!" అంటూ మూడుపూటలా క్రమం తప్పకుండా పెద్దపెట్టున దండోరావేసేరు.

అయితే ప్రజలు తిరుగుబాటు మానేసేరా?

చావుకి కాస్తంత దూరంగానూ, బ్రతుక్కి కాస్తంత దగ్గరగానూ వున్న ప్రజలు ఆశతో కళ్లు పెద్దవిచేసి చూసేరు. చావుకి చాలా దూరంగానూ, బతుక్కి చాలా దగ్గరగానూ వున్న ప్రజలు రాజుగారి ఔదార్యాన్ని పొగిడేరు.

కాని చావుకి అతిదగ్గరగా వున్న మనుషులూ చావంటే భయంలేని వ్యక్తులూ మొదట అనుమానంగానూ, తరువాత అపనమ్మకంతోను వుండిపోయి అడవుల్లోకెళ్ళి ఆకులలములు తింటూండేరు. వారిని రాజుగారి సైన్యాలు వేటాడేయి. తమ పాచికలు తాత్కాలికంగా పారినందుకు రాజు, రాజవర్గం అంతానూ అత్యంతోత్సాహంతో రజతోత్సవాలు జరుపుతుంది.

మరి రాజుగారు భూమిలేనివారికి భూమిని, తిండిలేనివారికి తిండిని యిచ్చేరా? లేదు. యిస్తామిస్తామంటూ కాలం గడిపేసేరు.

[రా. వి. శాస్త్రి వేతనశర్మకథ చదివేక.]

ఎర్రసీమలదారి

"అగ్నికణం"

తెల్లోల్ల సేతుల్నుంచి నల్లోల్ల సేతుల్ల దోపిడి పడకముందు యిప్పుడున్న పెబుత్తంలా నిజాం పుకుం జబర్దస్తి సాగే రోజుల్లో కూలిబతుకులు బతికినా దొరల తమదివానాల్లో యెట్టి సేయిత్తన్నపుడు మున్నూటరవైదినాలు పనిసేత్తే జీతంరాల్లు మిత్తికి నాగులకి పోగా దొరల తిట్లు దీవెనలతో కడుపులు నింపుకుంటున్నరోజుల్ల యింట్ల దానికి పొయ్యే పానం వచ్చేపానం తెల్వటల్లా. గందుకె దొరదగ్గర మా అయ్యకొన్న రెండెకరాల్లో యకరం ఉల్లినర్సయ్య బుల్లిపెట్టెలో ఇరికించాల్సొచ్చింది. నిజానికాపెట్టెకి పానం లేక పోయినా మా వూరోల్ల రకితమాంసాలు తినిబలిసి కాంకిరీటు అరల్లోకి పత (అడ్రిప్) మారుసుకుంది.

పత మారినప్పట్నుంచే ఆకలిపెరిగి పక్క వూల్లమీదపడి తెగతిని బలిసిపోతన్నది. వూల్లల్లో వాల్లు 'పెరగటం యిరగటాని'కంటంటె యిరిగినియన్ని తిని అరగించుకొని తెగపెరిగి పోతన్నాది. పెరిగిపోతన్న ఆ పెట్టెలోని నా యకరం అరక్కముందె తిరిగి తీసుకుందమని అరికవతంలనె పనిక్కుదిరా.

తెల్లోడు పొయ్యి నల్లోడొచ్చాడన్నారు. బత్తి బాబులు ఓట్లని సీట్లని తిరణాల కుక్కల్లా తిరిగిన్రు. నాటుసారా వాటంగా పోయించిన్రు. ఊగించిన్రు. కొట్లాటలు పెట్టిన్రు. కేసుల్ల యిరికించిన్రు. కోరుట్ల సుట్లు తిప్పిన్రు. పారిటీలన్నరు. అల్ల పట్నాలు గడుపుకున్నరు. పొట్టలు నింపుకున్రు. ఒడ్డున కూకున్రు.

గట్ల ఓట్ల తిరిపాలకి ముమ్మారు తిరిగిన్రు. సోషలిజ మన్నరు. దున్నేవానికి బూమన్నరు. తినోన్నడివి తినబెట్టన్రు. తినవోడిని పెట్టిందాకా ఆగమన్నరు.

ఈ పెబుత్తం వచ్చినాక పుట్టినోడిక్కాడ ఓటిచ్చికూకుంది కాని దున్నేవానికి మాత్తరం బూమిరాలా. గట్టిగ బూమికావాలనోల్లెల్లిందర్ని పెబుత్తం సొంతకరుసుల్తో రాజమండ్రి యెట్టిగదుల్లో కంపించింది.

పాలికేల్లు కవతంల పనిజేసినా ఉల్లినర్సయ్య కివ్వాల్సినదాకి ఉల్లిపొట్టంతైనా తీర్లా. తీరతందన్న ఆశ చుట్టుపక్కల వూల్లోల్ల కెవ్వరికిలేదు. నాకెట్టాగ వుంటది. యాడాది కల్లా మిత్తి అసలికి మించి పోతాంటె యెట్టా తీరుద్దాని దోయిదిగావుంది. ఇంత జాగు సేత్తె పొలం ఇల్లుగూడ పోద్దని యకరంతో సరిపెట్టుకోమని కాల్లెల్లబడి బతిమాలుకున్న.

గామాటకు సరెవన్నడు ఉల్లివర్పయ్య. గవ్వట్నుంచి సాగరోల్లపన్లజేరి రేయవక పగులనక కట్టపడి పనిసేత్తన్న. కాలవలయినంక వపీబు మారుద్దనుకుంటి. ఉన్నయకరం పెద్దకాలవబడి తమాం మువిగిన ఇంగ జూస్క నా కట్టాలు. దొరల కవతంల ఉన్నపుడిద్దరం ఉల్లోల్ల కవతంల కొచ్చెపాటికి నలుగురం. ఇప్పుడారుగురు మైనుం. రోగాలు రొట్టూ ఎక్కువైపోనాయి గుడిసెమీది కప్పు ఎగిసిపోనాది.

గూడూ గుడ్డా లేకపోతేమానె కాయకట్టంసేసెటోల్ల పేక్కింత గంజికూడ దొరకటంల సోమారం శనోరం ఒకపూట అన్నం మానుకోమని రేడియాలంటంటె ఆ రోజుల్లోనె ఒకపూట గటకతాగె మాలాటోల్లేం జేయాల్నో తెలియటల్లా

సిన్నోడు పాలటొక్కు వోయిండు. రోగాల్తో మరీ యండకపోతండు. పెబుత్తం ఆసుపత్తిరికిపోతె డాకసరి మందుల్లెవ్వండు, నా పిల్లడ్ని బతికిత్తడని అడనె పానసారం బడుంటె ఆండ్ల మందులున్నయొ లెవ్వొ తెల్దుగాని డబ్బులు మాత్తరం డాకసరిబాబు తెమ్మండు. డబ్బుల్కోసం రోజల్లి రెక్కలుముక్కల్సేసక పవిసేత్తే ముట్టిరూపాయిచ్చి తోలిండు పెద్దరెడ్డిగారు. నా కొడుకు బతుకుతుడుగందాని ఆసుపత్తిరికి సేరెపాటికి ఆనికి నూరేల్లు నిండుకున్నయి. అయిన నా యెర్రిగాని డాకసర్లు నరుసులమ్మలున్నా కుక్కలు పిల్లల్నీడసక పోతాంటె నా కొడుకేడబతుకుతడు.

పెద్దదానికి పాతికేల్లొచ్చినా పెల్లి సెయ్యాలా తిండే పెట్టలేకపత్తుంటె పెల్లేడసేద్దు. వొయిసొచ్చిందానికి పెల్లికాక గుడ్డల్లేక అవసరాలు గడవక పక్కింటోడితో లేసిపోనాది దాని తప్పేవుంది, తప్పంతా నాది, అయినోల్లు ఎలేత్తె ఇంట్ల ఉండలేక బయటికెల్ల లేక తలెత్తి తిరగలేక సతమతమయిపోతన్న.

పెద్దరెడ్డిగారి పెలక్కి కూలికిపోతె పెద్దబ్బాయిగోరి సూపులకి రాందోది సిరిగిన గుడ్డల్లో వొల్లు కనపడకుండ దాసుకోవాలని యమ యాతన పడతాంటె కడుపులో దేవినట్టు కత్తుల్తో పొడిసినట్టుగుండాది. సందకాడ సిరిగిన గుడ్డలు మరీ పేలికనై రకతపు సుక్కల్తో యింటికొచ్చిన నా బిడ్డని సూసికూడ ఏంసేలేకపోనా.

మూడోవాడు బజార్లపొంటి తిరిగి ఉన్నోల్ల పిల్లలాగ అన్నీ కావాలని యాగీ సేత్తంటే కొనిపెట్టలేక గంజి పోయలేక కసురుకుంట అడది బాత్తంటె వొద్దనలేక ఆ తప్పోరిదో తెలిసీ ఊరుకున్న నా పీక మలుముతున్నట్టవి పించింది. ఏంసేయాలి? ఏం సేయగల్ను? పిల్లలకు పెట్టలేక పస్తులుంచలేక కడుపు కోతగావుండి ఎండ్లన్నపడి సావాలనుకున్న కాని అంతపని సేలేకపోయ్న.

అంతల కాలవల్లి పొయ్యిన పొలాలోల్లకి దబ్బిత్తర్రని సెప్పినమ్రి ఆపీసర్లంట. కార్లల్ల వచ్చినమ్రి. అల్లొత్తె అల్ల కాల్లి యాల్లిబడితి, రేపంట్రి మాపంట్రి రూపాయకి పావలా లంటిరి. యేం జేద్దు. సరెనంటి. తీర నాపేరుసూత్తె అండ్ల కనబడదాయె. కాయితాలన్ని తిరగేసిసూసి మరీ సెప్పినమ్రి. పటవారికి గిరదావోరికి యియ్యాల్పిందిత్త నని తీర తెల్సుకుంటె మా తాత అయాంల కొన్న పొలం దొరోరిపేర ఉందట. అయ నకే దబ్బిచ్చినమ్రింట.

ఈ బాదలన్నిటికి తట్టుకోలేక ఎండ్లన్నపడి సావాలనుకున్న. నే సత్తె ఉనోల్లి బాదలు తగ్గవాయె. ఏమైనసరె అందరికి యిసమిచ్చి సావాలనుకుంటె ఏంలాబం? పచ్చి సాదిచ్చేదేం లేదనుకున్న. ఇదంత సూసినంక పావం కలుక్కుమంది. ఇన్నాల్లు పేసిన ఊడిగం మనసు ఓరుపును నంపి తూరుపు సూసి దొరోరి కవతంల ఉల్లోరి కవతంల కందికోసిన కొడవలికి పదును పెట్టమంది. పదునుమీద పదునెట్టి ఉల్లోరింట్ల దొరోరింట్ల పీకలమీదేటేసిన.

శీకాకులంల యర్రసీమలు పాముల్ని తిని బాగా బతుకుతున్నయి. ఆ దాతంట పోతున్న. అంతకన్న ఏదారిబాగోదు. అదే ఎర్రసీమలదారి.

విరసం నాటికలు

లోగా విరసం నాటికలు–నాటకాలు ప్రచురించాలని నిర్ణయించుకొని ప్రకటించిన మేరకు వచ్చిన నాటికల్లో, నాటకాల్లో గంగిరెడ్డిగారి నాటకం 'నాంది' ఉత్తమమయిందిగా భావించి ప్రచురించనయినది. ఇంకా రచయితల నుంచి విరసం ఆశయాలకు అనుగుణమైన నాటికలు, నాటకాలు ముఖ్యంగా ప్రదర్శన యోగ్యంగా వుండేట్లుగా రాసి పంపించవలసిందిగా కోరుతున్నాం. నాటకాలు, నాటికలు నేరుగా రాచకొండ విశ్వనాధశాస్త్రి, మహారాణిపేట, విశాఖపట్నంకు పంపించవచ్చును.

ఒడియా, హిందీ భాషల్లో విప్లవ కవిత్వం

నిఖిల్

సమకాలీన భారతీయ సాహిత్యంలో కవితాప్రక్రియ సమాజ పరిణామాలననుసరించి విప్లవపథంలో పయనిస్తూవుంది. నిర్భయంగా, నిస్సంకోచంగా విప్లవస్వరాలను వినిపిస్తూవుంది. అయినా యిప్పటికీ యిరుగు పొరుగు భారతీయ భాషలలో ముఖ్యంగా కవిత్వంలో జరుగుతున్న కృషిగురించి సూచన ప్రాయంగానే తెలియవస్తోంది. విదేశీ సాహిత్యంలో వస్తున్న మార్పులగురించి వెంట వెంటనే తెలుస్తున్నా మన భాషలగురించి మాత్రం ఎంతో కాలానికి హిందీ లేక ఇంగ్లీషు అనువాదాలు వస్తే తప్ప పరస్పర అవగాహన కుదరడంలేదు. అనువాదాలు వస్తున్నా ప్రతి భాషలో అత్యధిక సంఖ్యలో బూర్జువా పత్రికలే రాజ్యం చేస్తున్నందువల్ల విప్లవ సాహిత్యానికి - కవిత్వానికి ప్రోత్సాహం లభించడంలేదు.

చెదురు మదురుగా సంకలనాలద్వారా ఒకటో రెండు చిన్న పత్రికలద్వారా విప్లవ కంఠాలు అన్ని భాషల్లో యీనాడు ప్రళయఘోషను సృష్టిస్తున్నాయి. ఈనాటి యుగ స్వభావమైన పోరాట తత్వానికి జీవం పోస్తున్నాయి, విప్లవమనే యుగధర్మాన్ని ప్రతిబోధిస్తూ పురోగమిస్తున్నాయి. శాసనాల కట్టుబాట్లు, చట్టాల ఇనుపచట్రాలు ఈ ఉప్పెనలో కొట్టుమిట్టాడుతూ ఆడపాదడపా సంకలనాలను నిషేధిస్తున్నాయి.

అందుబాటులోవున్న కొన్ని సంకలనాలు, చిన్నపత్రికల సహాయంతో ఈరెండు భాషల్లో ఈనాడు వస్తున్న విప్లవ కవిత్వంగురించి రేఖామాత్రంగా చెప్పాలనిమాత్రమే ఈ ప్రయత్నం. అందువల్ల ఒడియా, హిందీ భాషల విప్లవ కవిత్వాన్ని గురించి ఇది సమగ్ర పరిచయం కాజాలదు.

ఒడియా :

ఆంధ్రదేశంలోని తూర్పుకనుమలను తాకుతున్న ఒరిస్సా రాష్ట్రంలోకూడా తీవ్రవాద ఉద్యమాలు వచ్చాయి. తత్ఫలితంగా ఒడియా కవిత్వం తీవ్రవాద భావధోరణికి చోటివ్వక తప్పలేదు. దానితోబాటు ఒడియా యువరచయితల సంఘంకూడా ఐదారు సంవత్సరాలనుండి ఆధునిక ఒడియా సాహిత్యాన్ని ముమ్ముందుకు తీసుకవెళ్లే ప్రయత్నం చేస్తున్నది.

చైతన్య 'మహాప్రభు' భక్తిరస ప్రధానమైన గీతాలు యింకా జనసామాన్యంలో వున్నా రబీసింగ్ లాంటి విప్లవ కవుల గీతాలుకూడా ప్రచారంలోకి వచ్చాయి. తూర్పు కొండలనుండి శ్రీకాకుళ సూర్యుడు ప్రచండ కిరణాలను ప్రసరింపచేసాడు. రమేష్ సాహు, నాగభూషణ్ పట్నాయక్ లాంటి విప్లవవీరులు ఆకాంక్షణాలై కవులకు కవితా వస్తువులై తీవ్ర పరిణామాలకు దారితీసారు. ఎన్నో తీరులుగా జమీందారులు, చిన్న చిన్నరాజులు ప్రజలను కొల్లగొట్టి దరిద్రులకు తమ ఆడంబరాలను ప్రదర్శించి తృప్తి చెందారు. అనేక రాజకీయ, ఆర్థిక సుడిగుండాలు ఉద్భవించడానికి కారకులైనారు. ఆ సుడిగుండాల్లోంచి కొత్తతరం ఒడియా యువకవులు విప్లవ కవిత్వాన్ని సృష్టిస్తున్నారు.

ఈ కవుల్లో ముఖ్యమైనవాళ్లు "అవధూత్‌కవులు". (అవధూత=దిగంబరసన్యాసి; కదిలించేవాడు; అమూలాగ్రం మార్పుకోరేవాడు) అగ్నిశర్మ, అఖిలపతి, అగ్రగామి, ప్రణావతి, అగ్రిదూత అనే కలంపేర్లతో రచనలు చేస్తున్న ఈ ఐదుగురు యువకవులు ఒడియాలో మండించే కవిత్వాన్ని వ్రాస్తున్నారు. ప్రజాపోరాటాలను సూటిగా, ఒక్కోసారి ప్రతీకలలో కవిత్వంలో వ్యక్తంచేస్తున్నారు. పౌరాణిక పాత్రల ప్రతీకలను విప్లవ పోరాటాలకు అన్వయింప చేస్తున్నారు. అగ్నిశర్మ 'ఎర్రికలువ' అనే తన కవితలో ఒకచోట యిలా అంటాడు- "నేను అహల్యను / లోతుగా పాతుక పోయాను / గెరిల్లా నాయకుడి స్పర్శకోసం వేచి వున్నాను."

అఖిలపతి తన "వానకాలం"అనే కవితలో 'మాపేరు దరిద్రులైన పాండవులు ... తూర్పుదిశ భగ్గున మండుతోంది, మరి ఎవరు విముక్తిప్రదాత? బుద్ధుడుకాదు, గాంధీ కాదు- అదిగో మనిషి రక్తంలోంచి పుడుతున్న విశ్వ విముక్తి రూపం.'

అగ్నిశర్మ రచించిన "విప్లవం"అనే ఈ చిన్నకవిత ఎంత శక్తివంతంగావుందో చూడండి-

"శోకతప్త దాహంతో ఈ భూమి
ఏకమవుతోంది పెచ్చనిరైతు చెమటతో పొలంలో
రైతు శ్రమశక్తి 'ఈథర్'లోకి లీనమై
పండిస్తోంది తిరుగుబాటు స్వరాలను."

ఈ ఐదుగురు అవధూతకవులేకాకుండా మరికొంతమంది ఆధునిక కవులు విప్లవ పోరాటాలవల్ల ప్రేరితులై నక్సలైట్ నాయకులను, నక్సలిజాన్ని కావ్య వస్తువులుగా స్వీకరించి ప్రజాపరమైన సాహిత్యాన్ని రచించారు. అమరేశ్ పట్నాయక్ తన ఒక కవితలో నక్సలైట్లను బుద్ధుని కొడుకులని వర్ణిస్తున్నాడు. దేబేంద్రనాథ్ మాన్‌సింగ్ తన 'విముక్తి'అనే కవితలో- "కామ్రేడ్స్, తూర్పు ప్రపంచాన్ని వినాలంటే, నిజాని

దర్శించాలంటే చూడండి బొలీవియా. వియత్నాం అడవుల్లోకి / పెకింగ్, కోరాపుట్ పర్వతపంక్తుల్లోకి "...... "కామ్రేడ్స్, అటుచూడండి— చిల్కా సరస్సులోని నీలి జలాల్లో లేస్తున్న రక్తకెరటాలను. అవి దూరంగా 'భావేరీ', 'ఘంటశిల' లోయల్ని వణికిస్తున్నాయి."

హంస్సేన్ రబీగాంధీ తన "స్వతంత్రం" అనే చిన్నకవితలో స్వతంత్రమంటే ఏమిటో చెబుతున్నాడు.

"ప్రతి ఒక్కర్ని మనం అడుగుతున్నాం
స్వతంత్రం, స్వతంత్రం ఎక్కడని—
హిమాలయాల అవలివైపునుంచి సమాధానంగా అరుపు
'తుపాకిలోనే స్వతంత్రంవుంది."

ప్రసన్నకుమార్ పటానసీ "నాగభూషణం కోసం" అనే కవితలో దాదాపు నక్సలైట్లుగా ప్రసిద్ధిచెందిన వ్యక్తులనందరిని పేర్కొంటూ ఆ విప్లవ వీరులందరు శ్రామికశక్తి కరుణరసానికి పొంగుతున్న యువకశక్తితో రక్షణయిచ్చే భీమా వంటి వాళ్ళని అభివర్ణిస్తున్నాడు.

అశ్వినీకుమార్ మిశ్రా, బైకుంఠ్ బిస్వాల్, బ్రజనాథ్ రథ్, బైష్ణవ్ చరణ్ సమల్, విద్యానందపతి, నళినిదేవి రౌత్‌రాయ్. డా. ప్రసన్నకుమార్ మిశ్రా, రవీంద్రనాథ్‌సింగ్, సదాశివ్‌దాస్, సమరేంద్ర నాయక్, త్రిలోచన్ భోల్‌కూడా ముఖ్యంగా ఈనాడు విప్లవ కవిత వ్రాస్తున్న ఒడియాకవులు.

హిందీ :

ఆధునిక హిందీకవిత్వంలో వ్యక్తివాదధోరణులు, భావకవితాధాయలు, ప్రయోగ మార్మికవాదరీతులు ఇంకా వినబడుతూనేవున్నయి. వ్యాపారసరళిలో నడిచే పెద్ద పెద్ద పత్రికలు ప్రయోగవాదకవిత్వానికి ఇచ్చినంత ప్రాముఖ్యతను విప్లవ కవిత్వానికి యివ్వడంలేదు. ఆధునిక హిందీకవిత్వం అంచెలంచెలుగా పొందిన పరిణామాల్ని వివరిస్తూ ఇంతక్రితం "సృజన" (నవం-జనవరి 1968)లో "నయాకవిత ఆ తర్వాత", "సృజన" (ఫిబ్ర '71)లో "ఈనాడు హిందీలో విప్లవకవిత" అనే వ్యాసాలు వచ్చాయి.

వారణాసిలోని 'జనకళామంచ్'ద్వారా వెలువడిన విప్లవ కవిత్వం ఈనాడు రావడంలేదు. ప్రభుత్వయంత్రాంగానికి బలై ఆ కవులు విశ్శబ్దంగా వున్నారు. అయితే ఉత్తరప్రదేశ్‌లో గతసంవత్సరం ఏర్పడిన ఉ. ప్ర. విప్లవ రచయితల సంఘం విప్లవ

సాహిత్యాన్ని సమీకరిస్తూవుంది. మారుమూల ప్రాంతాలనుంచి అనేకమంది కవులు సంకలనాలుతెస్తూ హిందీ విప్లవ కవిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెడుతున్నారు.

ఈనాడు హిందీ విప్లవ కవిత్వంలో ప్రముఖంగా వినబడుతున్న పేర్లు హంసరాజ్ రహబర్, సుదర్శన్‌చక్రి, ముక్తికుమార్ మిశ్రి, కల్లూమల్‌రుద్ర్, శ్రీరాంశుక్ల, రామకృష్ణ దీక్షిత్, భోలానాథ్ విప్లవి, రామలాల్, మధురేశ్ మొదలైనవాళ్లు.........

సుదర్శన్‌చక్రి అతని కుమారుడు ముక్తికుమార్ మిశ్రి పాటలరూపంలో జనానికి దగ్గరిగావెడుతూ విప్లవతత్వాన్ని ప్రబోధిస్తున్నారు. విప్లవసాహిత్యానికి జీవితాల్ని అంకితంచేసి కష్టనష్టాల్ని యెదుర్కొంటున్నారు. మిశ్రి రచించిన కవితల సంపుటి "ఫూల్ ఔర్ ఫౌలాద్"లో అనేక అంశాలపై ఖండికలువున్నాయి. సంప్రదాయరీతుల్లో ఛందస్సును పాటిస్తూ యీయన యెక్కువగా వ్రాస్తున్నారు.

హరిహర్ ద్వివేదీ, ఉగ్రసేనసింగ్, తడిత్‌కుమార్, డా. మహేశ్వర్ తమ "శురూవాత్"అనే సంకలనంద్వారా విప్లవస్వరాల్ని వినిపించారు.

"ఎంతో కాలం నడిచిన తర్వాత
మార్పు పేరుతో పేరుమాత్రమే మారింది,
కిటికీల రంగు మారినంత మాత్రాన
గుహలలోని చీకటి ఎలా తొలగుతుంది?
మామూలు ఊపిరికోసం ఈనాడు
కొండలతో ఢీకోవలసివుంది." (ఉగ్రసేన్‌సింగ్)

'సవ్యసాచీ' అనేకవి "సుబహ హోనేసే పహలే" అనే తన కవితా సంపుటిలో ఉత్తమ ఖండికలు రచించారు.

"టీకప్పులో విప్లవ సూర్యుణ్ని
ఉదయింపచేసే అసమర్థత
చీత్కారం — కోపతాపాలు
పీడించే విషపు ముళ్ళను
జీవితంనుంచి దూరం విసిరివేయలేవు." (సవ్యసాచి కవిత)

ఈ రూపంగా హిందీ, ఒడియాభాషల్లో వస్తున్న విప్లవ కవిత రేఖామాత్రంగా మీముందువుంది. విప్లవధోరణి క్రమంగా బలం పుంజుకుంటున్న నిదర్శనాలు కనపడుతున్నాయి.

శివసాగర్ గీతాలు రెండు:

జనం ఊపిరితో

నీవు నరికిన నా శిరస్సును
ప్రజలు మళ్ళీ నాకిస్తారు
నీవు పెరికిన నా కనుగుడ్లను
కాలం కన్నులుగా పొదుగుతారు
నీవు ముక్కలుగా నరికిన నా వేళ్లతో
ప్రజలు శ్రామిక జన మహాకావ్యాన్ని వ్రాయిస్తారు.

అరె! బద్మాష్!
నిన్న నీవు దెబ్బతీసిన నా దళం
నేడు జనం ఊపిరితో ఎర్రసైన్యంగా ప్రాణం పోసుకుంటోంది
కళ్ళ కావరంతో నీవు బంధించాలనుకున్న మా ఎర్రజెండా
లాల్‌ఖిల్లాపై ఎగిరేందుకు కసిగా కత్తులు నూరుతోంది
నీ తాత్కాలిక విజయాలకు
చరిత్ర శాశ్వత సమాధి కడుతోంది.

కీచకవధ

కొమ్మల్లో కోయిలమ్మ ఏమిటన్నది?
నెత్తురొలుకు పాటలనే పాడమన్నది.
రెమ్మల్లో రేగిపండు ఏమిటన్నది?
వీరుడొచ్చి పిలుచువరకు పలుకనన్నది.
మబ్బుల్లో చందమామ ఏమటన్నది?
వెన్నెలంతా ఏటిపాలు చెయ్యనన్నది.

అడవిలోని దావానలం ఇంకేమిటన్నది?
అడవి ఓడిపోవు వరకు విడువనన్నది.

బుగులుకొనే జనంగుండె ఏమిటన్నది?
కీచకవధ తప్ప మరో మార్గం లేదన్నది
కురుక్షేత్రానికి కీచకవధ నాంది అన్నది.

ఏ వూరు?

ఎ. ఆర్.

ఏ వూరని నిన్నెవ్వరడిగినా
నక్సల్‌బరియని చెప్పాలె.
ఎక్కడ చదివావని ప్రశ్నిస్తే
శ్రీకాకుళమని చెప్పాలి.
ఎక్కడ పనిచేస్తున్నావంటే
బొగ్గుట్టల దిశ చూపాలి.
ఏమతమంటే మావో మతమని
ఏ కులమంటే శ్రామిక కులమని
కుటుంబమడిగితె మృతవీరులదని
ఘంటా పథంగ చెప్పాలి.
ఏ వూరని నిన్నెవ్వరడిగినా
నక్సల్ బరియని చెప్పాలి.

పంజాబీ కవిత:

గోడవిూది రాత

జగతార్

జైల్లో చీకటి బొక్కలో
గోడమీద రక్తంతో
అతను రాసిన మూడు శబ్దాలు
'జీవితం ... స్వేచ్ఛ ... విప్లవం.'

మూసిన తలుపు సందులోంచి
అతనుచూశాడు ఆవరణలోకి;
సూర్యుడికింద ఎన్నోపూలు నవ్వుతూ
వెదజల్లుతున్నాయి సువాసనలు.
వాటి సుగంధం
గాలిలా-తిరుగుబాటులా
వాడిపోదు, చావదు - ఏనాటికి ;
ఇది అర్థంకాగానే
అతని మొగం వెలిగింది ఆనందంతో.

మరోగోడమీద
మరోసారిలా రాసాడు అతను:
"ఈ ప్రపంచంతో
అనుబంధాన్ని తెంచుకోవు
నాకళ్లు మెదడు చెవులు పెదవులు.
రాత్రిపూట
తలుపు సందులోంచిపారి
నాతోబాటు నిర్భయంగా నడుస్తుంది వెన్నెల.
ఉదయాన్నే

కనపడని పక్షి
కాపలా జవాను తుపాకీని
బూట్ల నాళాల చప్పుడును
లక్ష్యం చేయకుండా
పెద్దగా కూస్తుంది:
'రాత్రి కాపలా ముగిసింద'ని

ఈ పాలించే తోడేళ్ళు
'మృత్యువు'
అనే ఒక్కమాటతో
మమ్మల్ని బెదిరిస్తుంటాయి
కాని ఆ బెదిరింపు
నక్కలను-కాకులను బెదరగొట్టాలని
నా భార్య చిరిగిన దుస్తులతో తయారుచేసి
పొలంలో పాతిన దిష్టిబొమ్మ తప్ప మరేమికాదు.

కామ్రేడ్స్! ఈజీవితం నిటారుగా తలఎత్తింది
మరగుజ్జు మృత్యువు చేతులు దానిని తాకలేవు"

అతను తుపుక్కున ఉమ్మి అరిచాడు-
'లంజకొడుకుల్లారా!
మహా ఆఫీర్లమనుకునే
గాడిద కొడుకుల్లారా!
చాతనైతే నా సర్వాన్ని నులిమివేయండి.
నా స్వరం
వ్యాపిస్తున్నది రోదసిలోకి
మంటల నాలుకలా
కనిపించని పక్షి పాటలా;
అదే తిరిగి వెలుగురేఖగామారి
మా కోసం జారీ చేయబడిన
'మృత్యువు'
అనే శబ్దాన్ని ఛేదిస్తుంది.

[తెలుగు పేత – నిఖిల్]

నేటి పంజాబ్ సాహిత్యంలో విప్లవవాణి

ధూప్ దీప్

తాను ఏ సమాజం నుంచి జనిస్తుందో ఆ సమాజాన్ని సరిగ్గా ప్రతిబింబిస్తుంది సాహిత్యం. విరుద్ధవర్గాలుగా చీలిన సమాజంలో సాహిత్యం సహజంగా చాల అనారోగ్యకరంగా వుంటుంది. అట్టి సమయంలో తీవ్రమైన రాజకీయ వుప్పెన మాత్రమే ఆ అనారోగ్యాన్ని నయంచేస్తుంది.

అక్టోబర్ 1967 నాటి నక్సల్‌బరీ ఝంఝ భారతదేశ చరిత్రలో ఒక కొత్తయుగాన్ని ప్రవేశపెట్టింది. యువలోకాన్ని ఎన్నో ఆశలతో, కలలతో నింపివేసింది. కమ్యూనిస్టుపార్టీ(మా-లె)అవతరణ చారిత్రకంగా ఒక ముఖ్యసంఘటన. ఈ పోరాటం నుంచి సాహిత్యం దూరంగా వుండలేదు. సాహిత్య వ్యాసంగం మానవ స్వాతంత్ర్య పోరాటాలనుంచి విడదీయరానిదని మరోసారి ఋజువైంది. ఈ నమ్మికతో విప్లవ రచయితలు, కవులు ప్రాణత్యాగాలు చేసారు. ఇలా ఒక సిద్ధాంతానికై అంకితమై బలైపోతున్న ఉత్తేజాన్ని గమనించిన సమకాలీన బూర్జువా రచయితలు తాము సృష్టించే సాహిత్యం ఒకేరకమైనపదాల ఇంద్రజాలం, కవి సమయాలమయమని గుర్తిస్తున్నారు.

దస్తావేజ్ 1969 సంచికలో అమరజీత్ చందన్ తన సంపాదకీయంలో ప్రస్తుతం ఇండియాలోని క్లిష్టపరిస్థితులు రచయితలను ఏ వర్గంవారిని బలపర్చదలచుకున్నారో ఖచ్చితంగా తేల్చుకొమ్మని బలవంత పెడుతున్నాయన్నారు. పవిత్ర భారత జనతా విప్లవ విజయానికై ప్రజలలో ఒకభాగమైపోయి, త్యాగాలు చేయవలసిన సమయమిదే. ఈ అవగాహనవల్ల పంజాబీరచయితలు, కవులు దేశంలోని జిగిబిగి సిద్ధాంతాలఅటవినుండి ఒక ఖచ్చితమైన మార్గం ఎన్నుకోగల్గారు.

ఈ సంఘటనకు ముందు
అనేక మార్గాల కూడలిలో
ఆగిపోయినై నా కాళ్లు
కాని ఇప్పుడు
నా మార్గం నేనెంచుకున్నాను. హల్‌వార్వే

ఈ విప్లవకవుల ఇటీవలి ప్రచురణలు కొన్ని: పాష్ రచించిన లోక్‌కథ(1970) లాల్‌సింగ్ విరచిత సబ్లెజ్ హవా (1971); అమరజీత్ చందన్ సంపాదకత్వాన

మిట్టీ ద రంగ్ మోహన్‌జీత్ సంపాదకత్వాన ఆరంబ్ కవితా సంకలనాలు జగతార్ రచించిన లాహో దెనా కాశ్ Facets of blood) 'రక్తంలో రకాలు' సరికొత్తగా వెలువడింది. ఈ వర్గానికిచెందిన రచయితలు మరికొందరు హర్ భజన్ హల్వార్వి, దర్శన్ ఖాట్కర్, గురుదీప్‌గ్రెవాల్, ఫతేజీత్, సుఖవంత్ కేర్ మాన్, సూర్‌జీత్ పతార్, జుజ్‌హార్‌సింగ్ మొదలైనవారు.

స్వచ్ఛమైన కవిత్వం (Pure Poetry), స్వచ్ఛమైన సాహిత్యం (Pure literature) వాదనను వీరు నమ్మరు. సమాజరూపాన్ని మార్చడానికై కవిత్వాన్ని ఒక ఆయుధంగా వీరు వుపయోగిస్తారు. వీరికి కవిత్వమే లక్ష్యం కాదు. కవిత్వాన్ని ఒక లక్ష్య సాధనకు సాధనంగా వీరు భావిస్తారు. సామాజిక సంబంధాలకు వెనుకవుండి పనిచేసే శక్తుల గురించీ, వర్గవ్యవస్థ గురించీ ఒక అవగాహనతో రాస్తున్న వీరి కవితలు ఒక లక్ష్యసాధనకై రచించబడుతున్నాయి. దుర్భర దారిద్ర్యం, బానిసత్వం నుండి భారత ప్రజలను విముక్తి చేయడానికి సాయుధ విప్లవమొక్కటే మార్గమని వీరు నమ్ముతారు. విప్లవ మార్గమంతా త్యాగాలతో నిండి వుంటుంది. ఒక విప్లవ సిద్ధాంతాన్ని నమ్మిన సాయుధ ప్రజానీకమే తమ ఆశలను, కలలను వాస్తవం చేసుకోగలదు. ప్రస్తుత వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను సాయుధపోరాటానికై వీరు పిలుస్తున్నారు. వీరికవిత లో ప్రధాన వస్తువు ఇదే.

ఈ విప్లవ కవితావిర్భావానికి ముందు పంజాబ్ సాహిత్య రంగంలో 'ప్రయోగ వాదుల'ని పిలువబడుతున్న రచయితలు ప్రాధాన్యం వహించారు. ఈ రచయితలను పరస్పర ముఖస్తుతిగాళ్ళముఠాఅని చెప్పాలి. లైంగిక అసంతృప్తి, నిరాశ, అసంబద్ధత (Absurdity) వీరి కవితలోని ప్రధానవస్తువులు. వీరు తమ కవితలలో దిగుమతిచేసు కున్న ఆధునికత, హిపోక్రిసీ, నిరాశలతో వ్యక్తిగతవాద వూబిలోకి దిగిపోయిన జీవ రహిత నపుంసక మానవునిరూపాన్ని చిత్రించారు. జె.ఎస్. అహ్లువాలియా ఈ అమో మయవాదానికి నాయకుడు. ఈయన ప్రభుత్వంలో పెద్ద వుద్యోగి. (మార్క్సిస్టునని చెప్పుకుంటాడు) ఈయన పంజాబీ కవితారంగంలో కొత్తకొత్త స్టంట్‌లను, సరికొత్తగా 'సంస్కరణవాదాన్ని' (R dicalism) ప్రవేశపెట్టాడు. ఈయన సంస్కరణ వాదం భూమిని అతివేగంగా వదలి గగనానికి వెళ్ళి అచట కొంత ఎత్తులో ఆగి భూమిచుట్టూ పరిభ్రమిస్తూంటుంది.

రాజకీయ కవితతో సంబంధంవున్న కవులే- వీరోచిత పంజాబీసంప్రదాయానికి నిజమైన వారసులు. అన్యాయాన్నీ అణచివేత విధానాన్ని ఎదిరించిన సిక్కుగురువుల వేదాంతంలోని విప్లవశక్తి, త్యాగనిరతి, దృఢనిశ్చయమూ, ఈ తీవ్రవాద యువకవుల

రచనలలో వున్నాయి- అసత్యం, నటన, ద్రోహంపట్ల ద్వేషం, అగౌరవం మనలో వీరు కల్పిస్తారు. అసహ్యకరమైన సమకాలీన సామాజిక జీవితంపట్ల, క్రూరమైన అణచివేత విధానంపట్ల భయభ్రాంతులనుచేసే క్రూరత్వంపట్ల వీళ్ళ కవిత ద్వేషం, పగ గుండెల్ని మండించే కోపం మనలో కల్పిస్తుంది. వీరి కవిత మధ్యతరగతి వర్గంవారిని తమ పతనాన్ని, చేతగానితనాన్ని, రక్షణలేని అమానుష వ్యవస్థని గుర్తింపచేస్తూ, వెన్నెముకలేని మేధావుల బానిసత్వాన్ని పొడిచి ఎత్తిచూపిస్తుంది. వీరి తొలికవితలో విప్లవ భావవాదం Revolutionary Romanticism) వున్నా, సామాజికవాస్తవాలను ప్రత్యక్షంగా అనుభవిస్తున్నందున, వీరి యిప్పటి కవిత నూతనత్వాన్ని సంతరించు కొంటోంది.

రాజీపద్ధతిని వీరు అసహ్యించుకుంటారు. శత్రువుపై ప్రత్యక్షచర్య చేయడం, శత్రువుపట్ల దయచూపని విధానంపై వీరికి నమ్మిక. కనుకనే వీరి కవితకు వ్యతిరేకత బయలుదేరడం సహజమే. పతనంచెందుతున్న శక్తుల ప్రతినిధులు, కొత్తగా తలఎత్తు తున్న శక్తులపై కోపతాపాలు చూపుతూ, వాటిని నాశనంచేయాలనుకుంటారు. తాము ప్రేమించే కళాత్మకవాదమూ (Aestheticism), మేధాసంపత్తీ ఈ కవితలో కానరావు గనుక కొందరు బూర్జువా నపుంసక మేధావులు ఈ కవితలో "ఖడ్గాలూ-బుల్లెట్లూ"తప్ప వేరే ఏమీలేదని తలచారు.

ఈ నవకవితలో సంప్రదాయబద్ధ కవితాగుణాలులేవు. అలాగని దీనిలో సెంటి మెంటూ, ఉ దే్ర క ం లేవనికావు. ఈ నవకవితకు ప్రతినిధి దిల్ అనేయువకవి. ఇతను దినభత్యంపై ఆధారపడ్డ కార్మికుడు. కనుకనే దారిద్ర్యం, బాధ, క్రూరత్వంల చేత చుట్టబడివున్న శ్రామికులవ్యధ, అవమానం, దైన్యం వర్ణిస్తాడు. అతని కవితలో అనిర్వచనీయమైన విచారపు ఛాయలు కనబడ్తాయి. నిరాడంబరమైన అతని పాటలు జానపదగేయ ఛాయలలో వుంటాయి. జనవరి 1968లో నక్సల్‌బరీ పోరాటాన్ని ఆహ్వా నించిన మొట్టమొదటి పంజాబ్‌కవి యీయన.

నక్సల్‌బరీ రైతాంగం తమ
భుజాలపై ఈ బెలతో
అరణ్యమార్గాలవెంట సాగారు
తమ పొలాలపట్ల ప్రేమతో
చంపబడ్డారు వారు విన్న
వల్లని గుడిసెల్లోంచి జ్వాలలు

పైకి ఎగుస్తున్నాయి
ఈ బిడారు ప్రతిచోటా
ఇలా ప్రయాణం చేస్తోంది.

'కత్తులతో నిండిన కఠినారణ్యాలు' దాటి వచ్చిన కవి పాష్ పంజాబీ కవిత్వ రంగంలో వేళ్లూనిన సంప్రదాయాన్ని విచ్ఛిన్నంచేసిన ప్రథమకవి ఇతను. రాజకీయకవిత రాయడంలో తనదంటూ ఒక శైలిని రూపొందించుకున్నాడు. దోపిడీవర్గాల పతనమౌతున్న సంస్కృతికి చెందిన చెత్తకుండీలను నాశనం చేయడం అవసరమంటాడీయన. ఆత్మస్థైర్యం, ఆత్మత్యాగంకు చెందిన బలమైన భావచిత్రాలు ఇతని కవిత్వంనిండా కనబడ్తాయి. ఇతని తొలికవితలో వివిధ సాంస్కృతిక శక్తులకుచెంది, నూతన అర్థాలను స్ఫురింపచేసే పదాలను సృష్టించడంచేత యితని భావచిత్రాలకు స్తబ్దత, క్లిష్టత యేర్పడింది. కాని ఇటీవలి కవితలో ఈ అలవాటునుండి తప్పించుకొని చాల సులభశైలిలో పాఠకునికి తేలికగా అర్థమయ్యేట్లు రాస్తున్నాడు. వర్గ విద్వేషంతో కళ్ళు మూసుకొనిపోయి క్రొత్తసత్యాల నంగీకరించకపోవడం అణచేవర్గాలవారి సహజగుణం.

మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా
సత్యం సత్యమే!
సత్యం— తన జీవితకాలమంతా బాధామయంగా గడపింది.
ప్రతి సత్యమూ—
ఒక బాధామయ జీవితకాలం పిమ్మట
ఒక నూతనయుగంగా మారుతుంది—
ఈ నూతన యుగం
పొలాలనూ, ఫ్యాక్టరీలను కౌగలించుకోడమేగాక
మిలటరీ ట్రూప్స్‌నుగూడ ప్రభావితం చేస్తుంది.
రేపు
ఈ యుగం
ఎర్రకోటపై కిరీటం ధరించి
కాలంయొక్క శాల్యూట్‌ను అందుకుంటుంది.
అప్పుడు
మీకు సత్యం అంటే సరియైన అర్థం తెలుస్తుంది.

దర్శన్ ఖాటర్ కవితలో ఆశావాదం, భవిష్యత్తుపై గాఢవిశ్వాసం ప్రస్ఫుటంగా కనబడ్తాయి. అతనిపై ఏడు హత్యానేరాలు మోపబడి ప్రస్తుతం కోర్టువిచారణలో

వున్నాడు. అమృత్‌సర్‌లో కస్టడీలో వున్నపుడు అతనిని పోలీసు అధికారులు చిత్రహింసకు గురిచేసారు. అతను తాను వున్నగదిలో నేలపై ఈక్రింది కవిత రాశాడు-

బానిసలుగా ఎప్పటికీ తలవంచము
దుమ్ములో పొర్లాడే, దొర్లే జీవితం అంగీకరించం
ఊర్ధ్వదృష్టితో- ఆశతో నక్షత్రాలవంక చూస్తాం

అమర్‌జీత్ చందన్ రైటర్స్ ఫ్రంట్ (రచయితల సమాఖ్య) పంజాబ్‌లో ఏర్పరచి, "నక్సల్‌బరీ- మా మార్గం"అని నినదించాడు. ఇతని కవిత పాఠకుని మేధస్సునాకట్టుకుంటుంది గాని అతన్ని ఉద్రేకపూరితుణ్ణిచేయదు. అతను చిత్రించే క్లిష్టసామాజిక మానసిక వైరుధ్యాలు, అయోమయం, అస్పష్టత మూలంగా సామాన్య పాఠకుణ్ణి అగమ్యగోచరం చేస్తాయి. అతను వియత్నాం, పాలస్తీనా, అంగోలా, మొజాంబిక్, గ్రీస్ (Mikis Theodorakis) చైనా, లాటిన్ అమెరికా దేశాల కవితలు ప్రతిభావంతంగా అనువాదం చేస్తాడు. కొన్ని మాసాలక్రితమే అరెస్టుకాబడి మూడు సంవత్సరాల కఠినశిక్షకు పాత్రుడయ్యాడు. ఎలక్షన్ స్టంట్‌ను తీవ్రంగా నిరసించాడు. దానిని ధనికవర్గాల 'కుర్చీల ఆట'గా పోల్చి వలసరాజ్యాల వారసత్వాన్ని లొంగుబాటు విధానాన్ని బట్టబయలు చేసాడు.

బాలట్ పెట్టెలు ఎవరికోసమై వున్నవో
వారు
అల్లావుద్దీన్ 'దీపాలు'
ఏ బల్లలపై
ఎద్దులజంటతో కూడిన
మూడురంగుల పతాకం పరచబడిందో
ఆ శాసనసభల బల్లలపై
గట్టిగా గుద్దుతూ
అన్యాయంగా ఆర్జించిన
ఆహారం జీర్ణించుకోదానికి
ప్రయత్నిస్తారు-
పంచమజార్జిని పొగుడుతూ
పాట ప్రారంభిస్తారు
జన మన అధినాయక........

నిస్సందేహంగా జుగతర్ కవితలో సునిశితమైన విప్లవ భావచిత్రణ వుంది. ఇతను విప్లవ కార్యాచరణలోవున్న మానవుని వివిధరకాలైన వుద్రేకాలు, ఆలోచనలను నిర్వచిస్తూ, విశ్లేషిస్తూ ప్రతీకవాదాన్ని తనకు తగ్గట్టుగా మలచుకున్నాడు. అతనుగొప్ప

కళాకారుడు. వివిధ సంగీతస్వరాలు వినబడేట్లు పదాలను కూర్చగలడు. ఈ పద్ధతులలో ఒక గాఢపరిభావం పాఠకునిలో సృష్టించగలడు. బూర్జువా సెంటిమెంటాలిటీ ముసుగు లాగి పారవేస్తాడు—

నా చితాభస్మం
వ్యవసాయక్షేత్రాలలో చల్లండనే
ఆఖరికోరిక కాని వీలునామా కాని
నాకు లేదు
అది అర్థంలేని కోరిక
....
.... (జగతర్)

మూడు సంవత్సరాల కాలపరిధిలోనే యీ విప్లవకవులు పంజాబీ యువకుల్లో ముఖ్యంగా విద్యార్థుల్లోనూ, ఉపాధ్యాయుల్లోనూ ఆదరణ సంపాదించుకున్నారు. మాత్రం ప్రభుత్వాన్ని విమర్శించినా అణచివేయబడుతున్న ఈ కాలంలో వీరు నిజమైన స్వాతంత్ర్యాన్ని కీర్తించారు. ఇవన్నీ చేసినందుకు పంజాబ్ చాల విలువైనమూల్యాన్ని చెల్లించింది. పాలకవర్గం ఎంత అనాగరికంగా దాడులు నిర్వహించినా ఈ విప్లవవాణి అణగదు. ప్రజలు పూర్వం పోరాడారు. ప్రస్తుతం పోరాడుతున్నారు. ఇకముందు పోరాడతారు, తమ అంతిమలక్ష్యం సాధించేవరకు పోరాడతారు.

మాకంటె ముందే
ఎందరో కవితలల్లారు
మా తర్వాత
కవితాగ్ని ప్రజ్వరిల్లుతుంది
సాధ్యమైతే
మా నాలుకలు మీరు కత్తిరించవచ్చు
కాని
విప్లవవాణి ఎప్పుడో ప్రచారమైంది. (దిల్)

రాబోయేకాలంలోని సామాజిక పరిస్థితులు, వాస్తవాలు వీరికి తమమార్గం తెలిపి పరిపూర్ణత సాధించడానికి సహాయపడ్తాయని ఆశిద్దాం. వీరు తప్పక అభ్యుదయపథంలో అభివృద్ధి సాధించి- కష్టాల నెదిరించి- అంతిమంగా అగ్నిజ్వాలలమధ్య నుండి పాటలు పాడే వీరులుగా పెరుగుతారు.

అనువాదం : రవిబాబు

(నవంబర్ 4, 1972 ఫ్రాంటియర్ నుండి.)

సమీక్షలు:

చైతన్యధార - 'చైతన్య స్రవంతి', 'ధార'

కవితా సంకలనాల సమీక్షవ్యాసం.

ఎస్. వి. ఎస్. రావు

పక్కయింటి అమ్మాయిలపై పద్యాలల్లడంతో కలం చేపట్టిన కవికుమారులకు, ఊరగాయల కాలం రాగానే సీసపద్యాలు సమర్పించి కవులకింద జీవిస్తున్న కవి పుంగవులకు యిటీవల వెలువడుతున్న విప్లవకవిత్వం వెగటుగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. కాని కవిత్వానికి ప్రాణం అందం, ఛందంకాక అనుభూతి అని గ్రహించగల సాహిత్యాభిమానులకు ఆంధ్రదేశంలో వాడవాడనుండి కొత్తగొంతుకలు వినిపించడం ముదావహమైన విషయం. మళ్లీ మరోసారి "నవ్య కవిత్వానికి యీనాడు ఇండియా అంతటికీ అగ్రస్థానం తెలుగుభాషది" అన్న శ్రీశ్రీ ఉద్ఘాటన నిజమే అనిపిస్తోంది. ఏనాడో కాలదోషంపట్టిన "అభ్యుదయ" కవిత్వాన్ని అటకమీదనుంచి దింపి ముస్తాబు చేద్దామనేయత్నాన్ని భగ్నంచేసి యువకులు, ఉత్సాహపూరితులు అయిన విప్లవ రచయితలు సాంఘిక సత్యాన్ని నగ్నంగా చిత్రించడం నూతనోత్సాహాన్ని కలిగించింది సాహిత్యరంగానికి. అయితే వాయువేగంతో ప్రారంభమయిన యీ కవితా ప్రవాహాన్ని రొటీను ధోరణిలో నాలుగైదు పాదాలుదహరించి అద్భుతంగా ఉందనో లేక అధ్వాన్నంగా ఉందనో నిర్ధారించడంలో ప్రయోజనంలేదు. ఈనాటి సాహితీపరులకు ప్రధానమైన ప్రశ్న వ్యక్తిగతంగా ఎవరు ఉత్తమ కవులని నిర్ణయించడం లేదా విప్లవ కవిత్వంలో లోపాలెంచటం కాదు. నానాటికి క్షీణిస్తున్న సాంఘిక వాతావరణంలో, సీరియల్ నవల్స్ సీరియస్‌గా చదువుకునే అదృష్టవంతులను మినహాయించి, మెదడు గుండెకాయ ఆరోగ్యంగా నిలబెట్టుకున్న నిజాయితీపరులు, అర్థరహితమైన 'అభ్యుదయ' సాహిత్యానికి అంత్యక్రియలు జరిగాయని, ఆంధ్రసాహిత్యంలో మరొక ఆశాజనకమైన అధ్యాయం ప్రారంభమయిందని గుర్తించడం ప్రధానం.

అభ్యుదయ సాహిత్యోద్యమంనుండి విప్లవ రచయితలు విడిపోవడంతో బయలుదేరిన కల్లోలానికి కారణం అభ్యుదయ సాహిత్యానికి నిర్వచనమేమిటో అర్థంచేసుకోకపోవడమని నా వ్యక్తిగతమైన అభిప్రాయం. అభ్యుదయ సాహిత్యానికి శాశ్వతమైన లక్షణాలు ఉండవనీ సాంఘిక పరిస్థితులనుబట్టి, సాంఘిక ప్రగతికై కృషిచేసే ప్రజా

ఉద్యమాల స్థాయినిబట్టి తనలోతాను నిరంతరం మార్పులు చెందుతుందని నేనిదివరకే సూచించేను (వసుధ– ఫిబ్రవరి '71). అందుకు బదులుగా అభ్యుదయ కవిత్వంఅంటే కేవలం శ్రమజీవులపై సానుభూతి ప్రకటించి జడాత్మకమైన నీతిపాఠాలు వల్లించడమే అని చాలామంది అభిప్రాయం. సిద్ధాంతస్థాయిలో నిర్దుష్టమైన అవగాహన లోపించబట్టే అన్నిరకాల వ్యక్తులు అభ్యుదయాన్ని ఊతపదంగా చేపట్టడంనుంచి చివరకా ఉద్యమం అర్థరహితమైన స్థితికి దిగజారింది. ఈ పరిణామానికి వ్యక్తిగతమైన విమర్శలకు బదులు చారిత్రిక కారణాలు, సమిష్టి బాధ్యత గుర్తించడం అవసరం.

అభ్యుదయ సాహిత్యానికి నిర్వచనం అనాథులపై కనికరంచూపడం కాదు. ఈ విధమైన సాధారణ సానుభూతిని కుహనా మానవత్వం ముసుగులో పాలకవర్గమే ప్రోత్సహిస్తుంది ప్రజల్ని ప్రమాదంలేని తప్పుడుదార్లు పట్టించడానికి. సమకాలీన సమాజాన్ని, సాంఘిక భావాలను, శక్తులను వాస్తవికంగా చిత్రించి సూచనప్రాయంగానైనా మార్గంచూపించి ఉత్తేజపరచినప్పుడే అర్థవంతమైన అభ్యుదయ సాహిత్యం వెలువడుతుంది. అభ్యుదయ సాహిత్యం క్రమేణా అర్థరహితం అయిందనడానికి ఒకే ఒక ఉదాహరణచాలును. "అభిజ్ఞాన శాకుంతలమున శకుంతల గాంధర్వ వివాహము కామలక్షణం. కామైక పరత్వమున కన్నుగానక ఆమె ధర్మమును విస్మరించినది. అందుకే క్లేశములపాలైనది". గాంధర్వ వివాహం క్షత్రియులకు శాస్త్రసమ్మతమనీ, కామైక పరత్వము దుష్యంత మహాశయుడిదనీ జగమెరిగిన చిన్న విషయాలు వదలివేద్దాం. పెద్దల మెప్పుకోసం అవసరమైనచోట యిలారాసినవ్యక్తి శ్రీశ్రీ అభినందన సంచిక (కళాకేళి-1970)లో 'క్రాంతి కవితారథ చక్రనేమి' అని పద్యంరాస్తే వేసుకోవడం జరిగింది సృజనలోనేపడ్డాయి యీ తరహా అభ్యుదయ రచనలు (విప్లవాక్షి రెప్పల్లో- సృజన మే 1970).

శ్రమజీవుల కష్టాలపై కన్నీళ్లు కార్చడంతో సరిపోదు నిజమైన అభ్యుదయపరుల కర్తవ్యం. కేవలం జీవకారుణ్యవాదంతోకాక సామాజిక చరిత్రపై వైజ్ఞానిక పరిశోధనలు జరిపి, అనాదినుండి మానవ సమాజంలోని అధిక సంఖ్యాకుల అభాగ్య జీవితానికి వర్గవ్యవస్థే కారణమనీ, వర్గసమాజాన్ని అంతంచేసి ప్రజానీకానికంతటికీ శాశ్వతమైన స్వేచ్ఛ, సమానత్వం కల్పింపగల శక్తి, నైతిక బాధ్యత కార్మికవర్గానిదని నిరూపించేడు కార్ల్‌మార్క్స్. రాజకీయమైన యీ మహత్తరలక్ష్యాన్ని విస్మరించి కేవలం కార్మికుల ఆర్థికస్థితిని బాగుపరచాలనే సంకుచిత లక్ష్యంగల కార్మికోద్యమం సాంఘిక పునర్నిర్మాణానికి పూర్తిగా నిరుపయోగం కావడం గత పాతికేళ్ల భారతదేశ చరిత్రే నిరూపించింది. అఖరికి పాలకవర్గంతో చేతులుకలిపి 'మే' దిన ప్రదర్శనాన్ని పర్వ

చినంగామార్చిన నాయకులు దాపరించారు మనకి. రాజకీయలక్ష్యంతోపాటు సామ్య వాదం కేవలం ఆర్థికసిద్ధాంతంకాదని మానవుని ఆధ్యాత్మిక జీవితంలోగల అశాంతికి ఒంటరితనానికి (Alienation) నివారణ మార్గమని యిటీవల వెలువడిన మార్క్సు తొలివ్యాస సంపుటి (Economic and Philosophic Manuscripts of 1844) విశదీకరిస్తుంది. సామ్యవాద సిద్ధాంతానికిగల తాత్త్విక ప్రాతిపదికను వివరించే యీ లఘు గ్రంథం విశ్వవ్యాప్తంగా మార్క్సిజంపై తీవ్రమైన పునరాలోచనకు దారితీసింది.

పాతిక ముప్ఫయిఏళ్ళక్రితం అభ్యుదయ సాహిత్యం బయలుదేరిన మొదటి రోజుల్లో కవిత్వపు విలువలదృష్ట్యా ఉత్తమ కవిత్వం సాహితీలోకంలో అపూర్వమైన సంచలనం కలిగించింది. కాని సాంప్రదాయరీతిలోని జీవకారుణ్యవాదంతో గజిబిజి కావడంవల్లా, కొంతవరకు వాస్తవికత లోపించడంవల్లా సిద్ధాంతజ్ఞానం కొరవడ్డంవల్లా కోకొల్లలుగా అస్తవ్యస్తమైన అభ్యుదయ రచనలు చాన్నాళ్లు రాజ్యంచేశాయి. నిజానికి ఆనాడు భారీ పరిశ్రమలూలేవు. కార్మికులూలేరు. పట్టణాలే అభివృద్ధికాలేదు ఆంధ్రదేశంలో. కాని సాంఘిక విమర్శ అనేదే మన సంప్రదాయంలో లేకపోవడంమూంచి ఆనాటికి అప్పటి ఉద్యమం విశేషమైన ప్రచారం పొందింది యువతరంలో. ఒక విధంగా ఆలోచిస్తే ఆనాటి అభ్యుదయకవిత్వం భావకవిత్వానికి చివరదశ అనవచ్చు. లేదా తిరుగుబాటు భావకవిత్వం అనవచ్చు. అందువల్లనే 'స్వా(హా)తంత్రం' వచ్చేక గత పాతికేళ్లలో నిజంగా పారిశ్రామిక సమాజం ఏర్పడి, యిటు పెట్టుబడిదారులు, అటు భూస్వాములు బలపడి జాతీయనాయకులమనే ముసుగుతీసి స్వైర విహారంచేస్తూ వర్గసమాజాన్ని అతినికృష్టమైన రూపంలో స్థాపించినప్పుడు అభ్యుదయ కవిత్వం నానాటికి క్షీణించి జీవం కోల్పోయింది. ఈ లోగా ఉద్యోగావకాశాలు పెరగడంనుండి 'విద్యావంతులు' స్వార్థపరులుకావడం, సాంస్కృతిక కార్యక్రమాలపేరుతో పాలకవర్గం కళాకారులను, సాహితీకారులను తమ గుప్పిట్లోకి ఆకర్షించుకోవడం, చిత్రసీమలోకి చిత్రంగా కవీశ్వరులు ప్రవేశించడం యిత్యాది కారణాలవల్ల అభ్యుదయ సాహిత్యం అడుగంటింది. చివరకు సాహిత్యరంగమే భారీ వ్యాపారకేంద్రమయింది.

ఇలాంటి పరిస్థితులలో సాహిత్యంలో మరోమలుపు అవసరమని పీఠిపాఠాలు వినోదాలుగాక సామాజిక జీవితాన్ని విశాలయితితో చిత్రించి రాజకీయ నైతిక సాంఘిక సమస్యల వేదికగా సాహిత్యాన్ని రూపొందించాలని భావించిన సాహితీపరులు విప్లవ రచయితల అవతరణను హర్షించడం జరిగింది. కాని వి.ర.సం పేరుతో మరో సంఘాన్ని నెలకొల్పడంపట్ల నాలాంటివాళ్ళకి చాలా అనుమానాలున్నాయి. అసలు రచయితలకు కవులకు సంఘాలు అవసరమా అని నా ప్రశ్న. కార్మికుల సంఘాలు,

యితర వృత్తులకు సంబంధించిన సంఘాల విషయంవేరు. కవిత్వం కళ యిత్యాదులు సృజనాత్మక వ్యాసంగాలుకాని సమిష్టి వ్యాపారాలు కావు. కవిత్వాన్ని సంఘాలురాయవు. కవులు రాస్తారుగాని. కళాజీవితానికి జీవం వ్యక్తిత్వం. ఫైళ్లు. చందాలు. సభలు. సమావేశాలు. తీర్మానాలు సాహిత్య సృజనకు అనవసరంకాదుకదా హానికరంకూడా. కేవలం ప్రచురణనిమిత్తం ఏదైనా ఆర్గనైజేషన్ అవసరంకావచ్చు. కాని భారీఎత్తున సంఘాలు స్థాపించడం గత చరిత్రను తిరగవేయడం అవుతుంది. నాకు అర్థంకాని మరో విషయం. విప్లవ రచయితల సంఘం ఉద్దేశ్యం ఏమిటి? కవులమధ్య విప్లవమా? కవిత్వంలో విప్లవమా? లేక కవిత్వంద్వారా సాంఘిక విప్లవమా? చాలావరకు మొదటి కార్యక్రమానికే ప్రాముఖ్యతనివ్వడం జరుగుతోంది. ఈనాడు కవిత్వంలో మార్పు రావాలనడం నిర్వివాదాంశం, కాని యీ నవ్యకవిత్వాన్ని రాయదలచినవాళ్లు. రాస్తున్నవాళ్లు యీ తరానికిచెందిన యువకవులు. కేవలం ఆవేశంమాత్రం ఉన్నా లేకపోయినా తెచ్చిపెట్టుకొని గతతరం కవులు కొత్తరకం సాహిత్యాన్ని సృష్టించగలరనుకోవడం ఉత్త భ్రమ. ప్రతిభావంతులైన నవయువకులను ప్రోత్సహించడం మాత్రమే మా తరం సాహితీపరుల విధ్యుక్త ధర్మం,

ఇక పోతే ఆదర్శాలపట్ల ఏకీభవించినా విప్లవకవులు రాస్తున్న కవిత్వం విషయంలోకూడా చాలావివాదాంశాలు ఉన్నాయి. కవి తన మనోభావాన్ని కవిత్వరూపంలో కళాత్మకంగా సూచిస్తాడు కాని నినాదాలద్వారాకాదు, Ah! Love Could thou and I with fate conspire / To grasp the sorry scheme of things entire,.. / Would not we shatter it to bits – and then / Remould it nearer to the Heart's Desire! కవులు ప్రబోధించే విప్లవం యీ స్థాయిలో ఉంటుంది. రమణీయమైన ప్రకృతి దృశ్యాలను చిత్రించిన Virgil కవిత్వంలోని రాజకీయాలమీద యీనాటికికూడ చర్చలు జరుగుతున్నాయి (Virgil – Pastoral Poems, Penguin 1949. కేవలం ధ్వన్యాత్మకమైన కవి ప్రవచనానికి అపూర్వమైన శక్తి సాంఘిక ప్రాముఖ్యతవల్ల ఎలా చేకూరుతుందో అర్థం చేసుకుందికి కవిత్వం ఎవరికోసం? దాని స్వభావం లక్ష్యం ఎలాంటివి అనే అంశాలు చర్చించవలసి ఉంటుంది.

కవిని మేధావి అనీ క్రాంతిదర్శి అనీ అనడం అన్ని కాలాల్లోనూ పరిపాటి. సామాజిక బుద్ధి జీవితానికి సాహిత్యం పరాకాష్ఠ అంటాడు Lersing. పై నిర్వచనాలను ఎలా అర్థంచేసుకోవాలో అవి ఎంతవరకు నిజమో పరిశీలించడం అవసరం. కవులు మేధావివర్గంలో ముఖ్యులనీ ప్రముఖులనీ భావించడంలో తప్పులేదు. కాని సంఘంలోని యితర మేధావులతోపాటు తన ప్రత్యేక బాధ్యతనుమాత్రమే నిర్వహిస్తాడు కవి. స్థూలంగా చెప్పాలంటే తత్త్వవేత్తలు, రాజనీతి పారగులు, సాంఘిక శాస్త్రజ్ఞులు

యితర మేధావులనుకుంచే (వైజ్ఞానికులు మరొక ప్రత్యేకవర్గం) కవి ప్రత్యేకత యీ క్రింది విధంగా ఉంటుందని నా అభిప్రాయం. ఇతర మేధావుల కతీతమైన భావు కత్వం, భావనాశక్తి గలిగి ఉండడంనుంచి కేవలం మేధాశక్తితోకాక సాంఘిక సమస్య లపై ప్రత్యక్షమైన హృదయానుభూతిని. భావనాపరంపరను సమాజానికి అందజేస్తాడు కవి. సమకాలీన భావ సముదాయనికి కళాత్మకరూపం కల్పించడంకూడా కవిప్రత్యేకత. కేవలం మేధాశక్తిపై ఆధారపడే యితర మేధావుల భావాలలో వాస్తవిక దృష్టి, హేతు వాదం, స్పష్టత మంచి లక్షణాలయినా మానవజీవితంపై ఊహాత్మకమైన (Abstract) సిద్ధాంతాలకుబదులు సజీవమైన పాత్రలను సృష్టించడం, ఎలాంటి భావాన్నైనా హృద యంగమంగా వెలిబుచ్చగల నైపుణ్యం కవులకే చేతనవును, అందువల్ల కవిత్వంలో కొంతవరకు ఆత్మాశ్రియత, అస్పష్టత, భావశబలతవంటి బలహీనతలు స్వతహాగా కవిత్వరూపంలో వెలువడిన భావానికి సార్వజనీనత, హృద్యత లభిస్తుంది. ఉదాహర ణకు షేక్స్పియర్ తన సమకాలికులైన ఎలిజబెత్‌రాజ్ఞి, బేకన్‌లనుమించిన మేధాశాలి కాడు. కాని ఆనాటి సాంస్కృతిక జీవితానికి ప్రతినిధిగా మనం భావిస్తున్నాం, మార్క్స్ వంటి మహామేధావి సహితం తన సిద్ధాంతాలకు Timon of Athens నుండి కొన్ని పాదాలు ఉదహరించేదంటే కవికి మేధావివర్గంలోగల స్థానాన్ని గుర్తించవచ్చు.

కవిత్వానికి భావనాప్రపంచంలో యింతటి ప్రాముఖ్యత ఉన్నట్లు అంగీకరించినా సాంఘిక పురోగమనానికి కవులే పూర్తిబాధ్యత వహించాలనడం, రాజకీయ ప్రణాలిక లను కవిత్వంలో వెలిబుచ్చాలనడం సమంజసంకాదు, చేతనాత్మకమైన సాహిత్యాన్ని మేధావులకందజేయడం, విప్లవ భావాలను రసాత్మకరూపంలో ప్రచారం చేయడం ద్వారా సామాన్య పాఠకలోకం దృష్టికూడా విప్లవకరభావాలపై మళ్లించడం కవుల కర్తవ్యం. అటువంటి భావాలకు నిర్దుష్టమైన రూపకల్పన కార్యాచరణ విధానం జత గూర్చి ప్రజా ఉద్యమాలకు నేతృత్వం వహించడం రాజకీయ నాయకుల బాధ్యత.

అదేవిధంగా కవిత్వం ఎవరికోసం అన్నవిషయం గుర్తుంచుకోవడంకూడా అవస రం. కవిత్వం రాసేవాళ్లు చదివేవాళ్లు మహా మేధావులనడం దంభప్రలాపం కావచ్చు. నిజంగా అలాంటి కవిత్వంఉన్నా దాని సాంఘిక ప్రయోజనం పరిమితంగా ఉంటుందనీ అంగీకరించవచ్చు. కాని కవిత్వాన్ని ఆసక్తితో చదివి ఆస్వాదించడానికి కవిత్వం సూచించే భావసముదాయాన్ని అర్థంచేసుకుందికి తగినంత మేధాశక్తి, భావుకత్వం అవస రం అనడంలో అతిశయోక్తి లేదు. Prometheus unbound చదివి ఆస్వాదించ డం మేధాశక్తికి అంతిమపరీక్ష అన్నారు పెద్దలు. సిద్ధాంతరీత్యా మహాకవులవాక్కు పామర హృదయంలోకూడా ప్రతిధ్వనించగలదని అంగీకరించినా సామాన్యంగా కవి

త్వంలో అభిరుచి ప్రత్యేకమైన మనస్తత్వంద్వారా, వైయక్తిక సాధనద్వారా ఏర్పడుతుంది. ప్రజలకోసం కవిత్వం రాయడంవేరు ప్రజలస్థాయిలో కవిత్వం రాయడంవేరు అని యీ మధ్యనే 'సృజన'లోనే చక్కగా సూచించేరొక సోదర విమర్శకులు. కళల విషయంలో అ భి రు చి, సాధన అవసరమని స్వయంగా మార్క్స్ యీ క్రింది విధంగా సూచించేడు"... Just as the most beautiful music has no sense for the unmusical ear.. only through the objectively unfolded richness of man's essential being is the richness of Subjective human Sensibility (a musical ear, an eye for beauty etc.) either cultivated or brought into being...... The sense caught up in crude practical need has only a restricted sense (Philosophic and Economic Manuscripts of 1844 page 101). అందుచేత అందరికీ అన్నీ అర్థంకావాలనడం అందుబాటులో ఉండాలనడం ఆదర్శాన్ని నినాదంక్రింద మార్చడమని యిటీవల నేను సూచించేను (కళ-5 సంపుటి 1972).

కవిత్వం వివిధస్థాయిలలో ఉంటుందనీ సామాన్య పాఠకులనుకూడ ఆకర్షించగల కవిత్వం అసాధ్యంకాదని కొందరు భావించవచ్చును. అదీనిజమే. అదేవిధంగా సామాన్య ప్రజానీకాన్ని ఉత్తేజపరచగల సాహిత్యం అవసరంకావచ్చు. ఈ అంశం తరువాత వివరిస్తాను. కాని ప్రధానంగా సాహిత్యం, అందులో ముఖ్యంగా కవిత్వం, విద్యావంతులను కవిత్వంపై అభిరుచిఉన్న సహృదయులను ఆకర్షిస్తుందనీ అందుకు తగిన పటుత్వం కవిత్వానికి అవసరమనీ గుర్తించడం మార్క్సిజానికి విరుద్ధంకాదు. కళాసాంప్రదాయాలను, ప్రమాణాలను పూర్తిగా త్రోసి రాజవడం సాధ్యంకాదని యీనాడు సోవియట్ విమర్శకులే గుర్తిస్తున్నారు. 'Socialist Realism' అన్న వ్యాసంలో Fadeyau యిలా అంటాడు "A very large number of theoritical and critical works has been devoted to questions of artistic method. Proceeding from the premise that the philosophy of the proletariat is dialectical materialism, many of us believed that a new, revolutionary artistic method ought to be the method of dialectical materialism in Art. It is now obvious to all of us that such an attitude was pedantic and dogmatic and did Soviet Literature a great deal of harm" (Page 62 - Socialist Realism in literature and Art, Moscow 1971). సాహిత్యంలో ఎలాంటి ప్రక్రియలకు అవకాశాలు ఉన్నా సాంప్రదాయాన్ని ధిక్కరించి శూన్యంలోంచి కవిత్వాన్ని సృష్టించుదామనుకోవడం, అల్లసాని పెద్దన్నను మ్యూజియమ్‌లో నిలబెట్టాలనడం మార్క్సిస్టు దృక్పథంకాదు. ఎంతటి విప్లవాత్మకమైన భావమైనా కవిత్వమనే మూసలో కరిగినప్పుడే సార్థకమవుతుంది.

మేధావులను. విద్యావంతులను కాక నిరక్షరాస్యులైన సామాన్య ప్రజానీకాన్ని ఉత్తేజపరచగల కవిత్వం ప్రజలస్థాయిలో చెప్పదలచుకున్న కవులు పుస్తకాలు అచ్చువేయడానికి బదులు ప్రజలమధ్య నిలబడి తమ కవిత్వం చదివి వినిపించే ఉద్యమం ప్రారంభిస్తే నాలాంటివాళ్లు తప్పకుండా హర్షిస్తారు. అటువంటి కవిత్వం నాటకరూపంలో రావాలి. అసలు నన్నడిగితే కవిత్వంమీద మనందరం మోజు తగ్గించుకొని గద్య సాహిత్యంలో కృషిచేస్తే బాగుంటుంది.

కవిత్వానికి మూలసూత్రం కేవలం హృదయవేదనను యథాతథంగా గ్రంథస్థం చేయడమేననుకోవడం పొరపాటు. కవిత్వం భావోద్వేగంలో జనించి పాఠకునిలో భావానుభూతిని ప్రేరేపిస్తుందన్నమాట వాస్తవమైనా ఉత్తమకవిత్వానికి, సినిమా కవిత్వానికి భేదం ఉత్తమ కవిత్వానికి లక్ష్యం పాఠకుని మనోవీధిపై చిరకాల ప్రభావంకాని క్షణికమైన తాత్కాలికోద్రేకం కాదు. "—Not that the poem which we have read but that to which we return... possesses the genuine power and claims the name of poetry" అంటాడు Coleridge. నలుగురూ అడిపోసుకొనే సర్వసామాన్యమైన భావాలను ఛందోబద్ధంచేయడమేనా కవిత్వం? అన్నాడు Leigh Hunt వర్డ్స్‌వర్త్‌వంటి కవులను యీసడిస్తూ "What ! think ye a bard's a mere gossip who tells of the everyday feeling of everyone else". అందుచేత కేవలం ఉద్రేకపూరితమైన యీనాటి విప్లవ కవిత్వం లాంటిది యుద్ధభూమిలో సైన్యాన్ని (అదీకూడా అనుమానం చాలామట్టుకు) ఉత్తేజ పరచవచ్చునుగాని విద్యావంతులను ఉత్తేజపరుస్తుందనిగాని సహస్రాల తరబడి నిరాశతో నిస్పృహతో నిస్తబ్ధులైన. సామాన్య ప్రజానీకానికి ఆత్మవిశ్వాసం కలుగజేస్తుందనిగాని నాకు నమ్మకం లేదు.

అయితే గతపాతికేళ్లలో స్వరాజ్యంపేరుతో దేశాన్ని కబళించిన భూస్వాములు, పెట్టుబడిదారులు నానాటికి ప్రజాకంటకులుగా పరిణమించి మన పురాణాల్లోచెప్పిన అన్ని సద్గుణాలను బాహాటంగా ప్రదర్శించడం విజ్ఞులకు దుర్భర సంతాపాన్ని కలిగించడంలో ఆశ్చర్యంలేదు. చాలావరకు మేధావివర్గంకూడా ఎంగిలిమెతుకుల కాసపడి పాలకవర్గానికి తాళంవేయడం, ఆదర్శం, నాయకత్వం లోపించిన అమాయకప్రజలు బాబాలచుట్టూ చేరడం నిజంగా బాధాకరమే. ఇటీవల జరిగిన ఎన్నికలతో ప్రజాస్వామ్యం నిరుపయోగమేకాక బూటకమనికూడా తేలిపోయింది కొన్ని ప్రాంతాలలోనైనా. ఇలాంటి అత్యవసర పరిస్థితులలో చేతనాత్మకమైన నవ్యకవిత్వం సృష్టించడానికి అవకాశం అవసరం రెండూ ఉన్నాయి. ఈ మహత్తర బాధ్యతను విప్లవకవులు గుర్తిస్తున్నారా అన్న విషయం అనుమానంగా ఉంది. నామట్టుకు వాళ్లలో చాలావరకు

నెగెటివ్ దృక్పథమే కనిపిస్తోంది. ఈనాటికి అవసరమైన కవిత్వం రాయడానికి గత తరం కవులను, కవితారంగంనుండి విరమించుకున్నవాళ్ళను విమర్శించడం అనవసరం. తమ కార్యక్రమానికి అడ్డుతగిలినంత మేరకు విమర్శలు ప్రతి విమర్శలు అవసరంకావచ్చు, కాని కవితాలోకంలో ప్రస్తుతం చెలరేగుతున్న అంతఃకలహం నిరర్థక వ్యాసంగం. సిద్ధాంతజ్ఞానం సాధించిన సాహిత్యకారులుకూడా కేవలం వ్యక్తులకు విశేషమైన ప్రాధాన్యతనివ్వడం దేనికి? ఏ రకం కవులైనా సాంఘిక పరిణామ క్రమంలో తమ తమ చారిత్రిక పాత్ర నిర్వహించినంతవరకే వారి వారి ప్రాముఖ్యతను గుర్తించి గౌరవించడం. నిజానికి చాలామంది కవులు అతి స్వల్పకాలం మాత్రమే కవులుగా జీవిస్తారన్నమాట గుర్తుంచుకోవాలి.

విప్లవానికి నిర్వచనంగాని విప్లవాలు ఎలాగ ఎందుకు జరుగుతాయనిగాని చర్చించడానికి యిక్కడ అవకాశంలేదు. కాని ఏ సాంఘిక వ్యవస్థ అయినా పూర్తిగా శిథిలమై గత్యంతరం లేదనుకున్నప్పుడే విప్లవం చెలరేగుతుంది. కేవలం ఆర్థిక పరిస్థితులేగాక ప్రజల మనోప్రవృత్తిలో మార్పురావడం అవసరమని గుర్తించాలి, రష్యాలో ప్రథమ కార్మిక విప్లవ సందర్భంలో (1905) లెనిన్ యిలా అన్నాడు. Lenin wrote that Slogans Calling for an uprising are premature if no sign of a crisis are evident and "Until the masses have definitely shown that they have been roused and are ready to act" (Social Psychology & History - B. Porshnev, Page 46). స్వరాజ్యం సాధించిన పాతికేళ్ల అనంతరంకూడా ఒకమూల మలమల మాడుతూ మరోవైపున ఎందుకూ పనికిరాని ప్రభుత్వం లాటరీ టికెట్లు, రబ్బరుతొడుగులు తమ దారిద్ర్య నివారణకు- ప్రసాదిస్తే మహాభాగ్యంగా ఎగబడి స్వీకరిస్తున్న మన అమాయక ప్రజానీకాన్ని విప్లవానికి పూనుకోమనేముందు వారిని ఇలాంటి భ్రమలనుండి దూరంచేసేందుకు ఎక్కువగా కేంద్రీకరించటం అవసరం.

విప్లవ కవిత్వంలో యింతవరకు సూచించిన బలహీనతలన్నీ 'ధార'లో కనిపిస్తున్నాయి. ఇక 'చైతన్య స్రవంతి'కి సమీక్ష ప్రస్తుతపు చైతన్య స్రవంతి తప్పితే చెప్పవలసిందేమీలేదు. విప్లవకవిత్వం రాస్తున్న యువకులకు నిజాయితీతోపాటు సమృద్ధిగా భావనాబలం ఉన్నదనడంలో సందేహంలేదు. కాని వారి కృషిని కృంగదీస్తున్నదల్లా ఉత్సాహమొక్కటే కవిత్వానికి చాలునే మితిమీరిన ఆత్మవిశ్వాసం, కవిత్వపు విలువల పట్ల అశ్రద్ధ. ఈ నాటి కవిత్వంలోని లోపాలన్నిటినీ చర్చించడానికి అవకాశంలేదు. అవసరంకూడా లేకపోవచ్చు. నేను స్వయంగారాసిన కవిత్వం ఎక్కాల పుస్తకంసైజుకి రాదు. కాని ప్రధానాంశాలు కొన్ని సూచిస్తాను,

సంయమనం లోపించడంనుంచి కవిత్వపు విలువను చెడగొట్టే సుదీర్ఘమైన వర్ణనలు తరచుగా కనపడతాయి. లిరికల్ కవిత్వానికి ప్రత్యేక పరిస్థితులలో తప్పితే క్లుప్తత, బిగి బలం చేకూర్చుతాయి. Long poem is a Contradiction in terms అనేదాకా పోయారు ప్రముఖ విమర్శకులు. ఉదాహరణకు

"గుళ్లో బొద్దింకల పాకుడురాళ్లలో
ఆధ్యాత్మిక పలాయనావేశం
కపాలమోక్ష ఫట్ ఫట్ ల నిర్వేదం...." 'ధార' (పేజి – 9.)

మొదటిలైను చాలును యీనాటి కుహనా ఆధ్యాత్మిక జీవనాన్ని Expose చేయడానికి. రెండోలైను ఉండవచ్చు. మూడోలైన్ కేవలం ఎక్స్ట్రా. అలాగే 13వ పేజీలో

"ఖద్దరు గావంచాగాళ్లు
అహింసావ్రతాన్ని జపిస్తూ
పోలీస్ యంత్రాంగం ప్రయోగంతో
నీ అన్నాతమ్ముళ్లని
జైళ్లలో తొక్కుతున్నారు" (పేజి 13)

పోలీసుల ప్రసక్తి అనవసరం భావానికి, అదేవిధంగా

"రక్తంతో వర్తకం
రక్తాన్ని తాగుతున్నారు
నీ మాంసాన్ని కబాబుల్లా కాల్చుకుతింటున్నారు"– (పేజి 22)

అన్నతరువాత

"నీవాళ్లందర్నీ చూస్తూ కుములుతూ
ఆతుకుల బ్రతుకుతో"

వంటి మంద్రస్థాయిలోని లైన్లతో పొడిగించడంలో ప్రయోజనంలేదు. 'ఎరుపు' 'ఎరుపు' అంటూ యిరవై 'ఎరుపు'లకు బదులు నేనైతే అరడజను పదునైన ఎరుపులకోసం వెతికేవాడిని.

క్లుప్తతతోపాటు ఆధునిక కవిత్వానికికూడా వ్యర్థపదాలు విలువను తగ్గిస్తాయనే గుర్తింపు యింకారాలేదు మనకి. కనీసం ప్రాచీనకవుల ఛందస్సు వాటిని మరుగు పరచేది, ఈ రోజు అవి కొట్టొచ్చినట్టు కనపడతాయి.

"నల్ల బజారు నాగుల
స్వార్థం పడగలో.... వేలాడే బండరాళ్లలా
జావగారిన జారిన వృషణాల

నిస్సార సన్నాసులు." (పేజి 10)

'వేలాదే' అన్నప్పుడు 'జారిన' మళ్లాదేనికి?

"ఆకలి మంటలను
తీర్చలేక పడుతున్న బాధ
పేగుల ఘోష పేదవాడి బాధ
ధనికుని పెదవికి తీపి" — (పేజి 18)
"లే లే లే
బెంగాలు లేచింది
చిట్టడవి లేచింది
లే, లేచి సర్వాంగాల్ కదిలించి
సంకెళ్లను విడిలించి
సమరానికి ఆయత్తంకా" (పేజి 46)

సూచించిన పదాలు తీసి వేస్తాడు మంచికవి ఎవరైనా,

ఈనాడు తీవ్రమైన వివాదాంశంగా పరిణమించిన మరో అంశం కొన్నిచోట్ల జుగుప్సాకరమైన 'అశ్లీలత'. వస్తుతః అశ్లీలం అంటూ ఏదీ లేకపోవచ్చు, యీరకం కవిత్వానికి అవసరంకావచ్చు కాని యుక్తా యుక్త విచక్షణలేకుండా నాగరిక మానవుడు గౌరవించే సున్నితమైన సెంటిమెంట్స్‌ను హర్ట్ చేసే

"భూదేవి యోనిఫుండులో రసిలో
కుళ్లలో కూరుకుపోయి" (పేజి 12)

అభ్యుదయ పరులకు, విప్లవకారులకుగూడ భూదేవి మాతృదేవత. మానవత్వాన్ని ప్రబోధించే నిజాయితీకల కవులు యిలారాయడం హీనకృత్యం. అసలు విప్లవందేనికి? పశువులస్థాయిలో తిండికా? లేక నాగరిక మానవుడు యేర్పరచుకున్న విలువలను కాపాడుకుందికా?

వచన కవిత్వానికి ఛందస్సు అవసరం లేకపోయినా ఛందోజ్ఞానం (metrical Sense) అవసరం.

"పరిష్కరించలేని సమస్యలతో
తీసుకుంటున్న యంత్రాంగం
తీవ్రిందాల్చే అస్తవ్యస్తతని" (పేజి 12)

'తీసుకుంటున్న' బదులు 'సతమతమవుతున్న' అనివుంటే అక్షర రమ్యతతోపాటు మరో మాత్రలభించి 'పరిష్కరించలేని' పదంతో యించుమించు సరిపోయేది.

కవిత్వంలో ఛందస్సు, శబ్దసౌందర్యం విషయంలో అభిప్రాయభేధాలుండవచ్చు, కాని లిరికల్ కవిత్వంలో భావైక్యత అవసరం అనడం వివాదాంశంకాదు, ఈ విషయం లోకూడ అశ్రద్ధ కనిపిస్తోంది. అందుకు 'ధార'సంపుటిలోని 'నిర్మల' (పేజి 25)అనే ఖండిక చక్కని నిదర్శనం, పంచాది నిర్మలవంటి వీరవనితపై సమకూర్చిన గేయం పాఠకులను ఉన్నతాదర్శాలవైపు తీర్చిదిద్దడానికి, ఉత్తేజపరచడానికి ఉపయోగపడుతుంది.

'ఎదురింటి కుక్కకు
ఎన్నటికీ దాహం తీరదు'
'ప్రతిరాత్రి రంకురాత్రి' (పేజి 25)

వంటి పాదాలతో యీ గేయాన్ని ప్రారంభించడంలో ఔచిత్యం దెబ్బతింటుంది. ఒక పవిత్రవ్యక్తి సంస్మరణలో ఉదాత్తతను పాటించినప్పుడే పాఠకునిహృదయం స్పందించి చెరగని ముద్రపడుతుంది, ప్రజాభక్షకులైన యీనాటి పాలకులు సంఘాన్ని హీనాతి హీనమయిన స్థాయికి క్రుంగదీసారు. కాని ఔచిత్యం పాటించడం కవిత్వంలో రసాభాసం ఎవాయిడ్ చెయ్యడం అభ్యుదయకవులకుకూడా అవసరం.

"మంత్రికొడుకు మంగళగిరి ప్రయాణం
తొత్తు చెంచాల కంపెనీ"

వంటి పాదాలు

"తొలిపొద్దు ఎరుపు
ఎరుపు రంగు అవని రంగు
సముద్ర తరంగాలలో
సమతావేశం"

వంటి కవిత్వంలోకి చేర్చడం కళాత్మక విలువను, శైలిదృష్ట్యాఐక్యతను చెడగొట్టుతుంది. ఎందువల్ల యిటువంటి డిక్షన్‌లో ఐక్యతలేని కవిత్వం వస్తోందో ఆలోచిస్తే, అదేపనిగా అలంకారశాస్త్రాన్ని యీసడించడం, కవిత్వ స్వభావ స్వరూపాలపై సంకుచిత దృష్టిని పెంచుకోవడం అని నా ఊహ.

ఉత్తమ కవిత్వానికి భావం విషయంలోనేగాక శైలి విషయంలోకూడా విలక్షణత అవసరం. కవిత్వం అనిర్వచనీయం అనడంలోగల అంతరార్థం అపారమైన వైవిధ్యం వస్తువులోను, భావంలోను, భావావిష్కరణలోనూ కవిత్వానికి స్వాభావికమని గుర్తించడం. ప్రతి కవి తన మనస్తత్వాన్ని బట్టి తన భావనకు అనువైనమార్గాన్ని యాదృచ్ఛికంగానో బుద్ధిపూర్వకంగానో యెన్నుకుంటాడు. శయ్యారీతులనుగూర్చి చర్చ ప్రస్తుతం అనవసరం. నేను చెప్పదలచుకున్నది ఆత్మాశ్రియరీతిలోని భావోద్వేగంతో కూడిన లిరికల్ కవిత్వానికి, వస్త్వాశ్రియ దృష్టితో వెలువడే వ్యంగ్యాత్మక కవిత

(Social Satire) కుగల భేదం గుర్తించాలని యీ రెంటినీ జోడించడం బైరన్ వంటి మహాకవికే సాధ్యమవుతుంది. శ్రీశ్రీ విషయంలోనే యీ రెండూ కలగాపులగం కావడం ప్రారంభించింది 'మహాప్రస్థానం'తరువాత. వస్త్వాశ్రయకవిత్వం, పాండిత్యం, పటుత్వం శయ్యాసౌభాగ్యంవంటి పునాదులపై ప్రకాశిస్తుంది. (ఉదాహరణకు మిల్టన్, డ్రైడన్ యిత్యాదులు- తెలుగులో శ్రీనాథుడు.) లిరికల్ కవిత్వంలో పాఠకుని హృదయం ద్రవిస్తుంది నిరాడంబరమైనా (ఉదాహరణకు- ఎమిలీడికిన్సన్). అన్నిటికన్నా ప్రధానమైన సమస్య కవియొక్క అనుభూతి. వస్తువు, పదజాలం దాదాపు సమానం కావచ్చు. కాని షెల్లీకి స్పెన్సర్‌కి (కొద్దిచోట్లతప్పితే)గల అంతరం ఏమాత్రం కవిత్వంతో పరిచయంఉన్న పాఠకుడైనా గుర్తిస్తాడు. ఇక పోప్‌కి షెల్లీకిగల తారతమ్యం కవిత్వం అంటే తెలియనివ్యక్తి గుర్తించగలడు. కాలానుగుణ్యంగా అభిరుచులు మారవచ్చు. ఒకేకవిలోనే వివిధ ధోరణులు కనిపించవచ్చు(షేక్స్పియర్). పాఠకుల అభిప్రాయమే కాలాన్నిబట్టి మారవచ్చు. ఉదాహరణకు యీరోజు హోరేస్‌ని లిరికల్ కవి అంటున్నారు. కాని కవిత్వానికి వ్యక్తిత్వం అవసరమనడంలో తప్పులేదనుకుంటాను. ఒకవైపున కథావస్తువులోను భావంలోను వైవిధ్యం, మరొకవైపున వ్యక్తిగతస్థాయిలో- Poet as an individual ఐక్యత, నిగ్రహం, బిగి లోపించినప్పుడు విప్లవకవులు తాము ఆశించిన ప్రయోజనం సాధించలేరని నా అభిప్రాయం.

విప్లవ రచయితలను బలపరచడమేగాని, విమర్శించడంకాదు నా లక్ష్యం. ఈ నాటికి యిలాంటి కవిత్వం బయలుదేరింది అంటే బాడ్లేర్ కవిత్వం గుర్తుకువస్తోంది.

"This fire burns so fiercely in our Brains that we want to plunge into the bottom of the abyss, Heaven or Hell, what matter? to the bottom of the unknown to find the New"

(Trs. Ernst Fischer)

సవరణ

నవంబర్ సంచికలో జ్వాలాముఖి కవిత విప్లవ జాతీయగీతంలో యీ కింది చరణాలు ఇట్లా చదువుకోవాలి.

ఇది మాదేశం - ఇది మాప్రాణం
ఇది మా నరనరమున ప్రవహించే
గంగాఝరి విప్లవ విముక్తిబాణం.

ప్లస్ 'కసి' – మైనస్ 'ప్రతిభ'

[గిరీశం వచన కవితా సంపుటి— ప్లస్ మైనస్: వెల— 2 రూ.
ప్రతులకు— ఆర్. రాఘవరావు; జాజిరెడ్డిగూడెం;
సూర్యాపేట తాలుకా; నల్లగొండ జిల్లా - ఆంధ్రప్రదేశ్]

కవుల్లో ఒక వింతజాతికవులుంటారు. వాళ్లు, యితర కవులెవరికైనా పేరొస్తుంటే చాలా బాధపడిపోతూ ఉంటారు. అది వాళ్ళలో భరించరాని 'కసి'గా రూపొందుతుంది. ఆ 'కసి' ఎంత తీవ్రంగా ఉంటుందంటే యీ కావ్యరచయితే ఒకచోట స్వానుభవంతో చెప్పినట్లు

"ఉన్నపళంగా చచ్చిపోయి
వీళ్ళకంటె ముందుగా మరోజన్మఎత్తి
అప్పుడు వీళ్ళపైన ఉన్నకసంతా తీర్చుకోవాలి
అదొక్కటే నాకు ఉన్న ఆశ."

అన్నంతగా ఉంటుంది. ఐతే ఈ కసిగల కవుల్లో రెండురకాల వాళ్లుంటారు; ఒకళ్ళు ప్రతిభావంతులు, రెండోవాళ్లు ప్రతిభలేనివాళ్లు. ఈ కావ్యరచయిత రెండోజాతికి చెందినవాడు. ఈయనకి ప్లస్ 'కసి' – మైనస్ 'ప్రతిభ'

"నేనేమీ కమిటెడ్ రైటర్నికాదు"అంటూ ఈయన ఉపోద్ఘాతంప్రారంభించారు. కమిటెడ్ రైటరు యేదో వ్యభిచారం చేస్తున్నట్టు; "ప్రత్యేకమైన వర్గాలలోగాని, ఒకే దృష్టితోరాసే రచయితల సంఘాల్లోగాని నేను సభ్యత్వం పుచ్చుకోలేదు"అన్నదిరెండో వాక్యం- అంటే కొందరు కవులు కేవలం పేరుకోసమే ఈ పైపన్లు చేస్తున్నారనీ ఒక దృక్పథమనేది కవికివుంటే అతను మైలపడిపోతాడనీ ఈయన విశ్వాసం. అట్లా ఒక దృక్పథం ఉన్నవాళ్ళని యీయన విమర్శించడం యెందుకూ అంటే వాళ్ళకి పేరొచ్చేస్తోందని; అదే ఓ గేయంలో చెప్పాడు—

"ఇదంతా వెలుగులోకి రావడానికి
నలుగురి ఎదటా పడేందుకు ఎత్తని-"

అభ్యుదయ, విప్లవ కవిత్వాలు, ఉద్యమాలు, కమిట్‌మెంట్లు, దృక్పథాలు అన్నీ కేవలం పేరుపొందేటందుకు కవులుచేసే అల్లరి అని యీయనచేసే సిద్ధాంతం, ఆధునిక విమర్శ ప్రపంచంలో ఒక సరికొత్తపాయింటు!

ఈ కవికి కొంతమంది 'హిపోక్రైట్లు' తెలుసు. వాళ్ళమీద అక్కసు వెళ్ళబోసుకుంటాడు.

"ఆకూ చాకూ భేదం తెలియదు
'చేగువేరా' ఆదర్శం అంటావు-
ఒక్కపూట పస్తుండలేవు
ఆకలి కవిత్వం అళువుగా చెప్తావు-"

తనదృష్టిలో యిట్లాంటివాళ్ళే ఆయా ఉద్యమాలకి ప్రతినిధులని ఆయన భావం. పేరుకోసం పాకులాడ్డమే ధ్యేయంగాగలవాడు, అట్లాంటి కొందరు హిపోక్రైట్లనే తన ప్రతిస్పర్థులుగా యెంచుకుని గోలచేస్తూ ఉంటాడు. అంతేగాని జీవితం, సమాజం, దృక్పథం, కవితాప్రయోజనం, ప్రపంచాన్ని ఊపుతున్న ఉద్యమాలు, వాటి వెనక ఉన్న చారిత్రిక శక్తులు– మొదలైనవాటిని సీరియస్‌గా ఆలోచించడు. అన్నట్టు అటువంటి ఆలోచనలు, దృక్పథాలూలేని 'పరబ్రహ్మస్వరూపమే' కవి అని*దా ఆయన వాదం!

సమాజాన్ని మార్చడానికీ, రచనకీ ఏమీ సంబంధంలేదని చాలామంది ఈకాలపు అమాయకుల్లాగానే ఈయనకీ ఒక సిద్ధాంతం ఉంది.

"'మార్పు' అన్నా. 'నగరంలోవాన'న్నా
నున్న రామయ్యకేమీ ఒరగదు–
'తిరగబడు'అన్నంతలో మేఘాలు వర్షించవు-
'రా'అనగానే సంపద పరిగెత్తుకురాదు"
(సంపదకోసమే కవి'రా'అన్నాడని ఈయన నిశ్చితాభిప్రాయం)

అంటే రాత్రి ఓ గేయంరాసి కవి పడుకుని తెల్లారి లేవగానే ప్రపంచంలో విప్లవం వస్తేనే కవులు కవిత్వం రాయాలని వీళ్ళ అభిప్రాయం, సమాజంలో భావపరివర్తన దశలో రచనకున్న పాత్రనుగూర్చి యేమాత్రమూ శాస్త్రీయ అవగాహన లేనివాడు మాత్రమే యిట్లా అనగలడు–

ఐతే ఒకఫార్సేమిటంటే యీ రచయితగూడా సమాజాన్నిగూర్చే రాయడానికి ప్రయత్నించాడు. సమకాలీనసమాజాన్నీ, రాజకీయాన్నీ, బీదలపాట్లనీ, ఏదృక్పథమూ లేకుండా రాయడానికే కవిత్వాన్నుపయోగించాడు. అంతేగాక ఏ మాత్రం కవిత్వమూ లేకుండా ఉత్త అభిప్రాయాల్ని చెప్పుకుంటూ పోవడమే ఫ్రీ వర్స్ అనుకుని రాశాడు. మరియిట్లా ఎందుకు సమాజాన్నిగూర్చి అభిప్రాయాల్ని చెప్పాడంటే అట్లా రాస్తేగాని ఈ రోజుల్లో పేరురాదని భయం– (అట్లా రాసినా పేరురాదనడానికి యీ కావ్యమే నిదర్శనం)– పోనీ సమాజంగూర్చి రాసిన కవికి ఆలోచనల్లో ఏదైనా ఒక క్రమం ఉందా

అంటే ఏమీ కనిపించదు. ఎక్కువగా కనిపించేదేమిటంటే, పరిహాసంగా రాసుకుపోవడం. ఒక్కొక్క గేయంలో ఆయన వెక్కిరిస్తున్నాడో, వ్యంగ్యంగా చెప్తున్నాడో, సీరియస్‌గా ఖండిస్తున్నాడో అసలు ఆయన అభిప్రాయం ఏమిటో పాఠకుడి కందదు. 'గుర్తించుకో' అనే గేయంలో ఈ కాలంలోని తిరుగుబాటుభావాల్ని హేళనచేస్తున్నాడో సమర్థిస్తున్నాడో తెలియదు మొత్తంమీద యిదే ఈయన ఆర్ట్‌గా కనిపిస్తుంది.

'శోషలిజమ్'అనే గేయంలో 'సోషలిజమ్'అంటే ఏమిటో చెప్తాడు కవి.

"బిచ్చగాడిని బిర్లాగ్రూపులో చేరిస్తే సోషలిజమ్
బిర్లాని బిచ్చగాడుగా మార్చినా సోషలిజమే
అందరూ బిర్లాలయినా
బిర్లాలు బిచ్చగాళ్ళైనా
అలా యిలా ఎలా జరిగినా
సమత్వం ప్రాప్తిస్తుంది–
సోషలిజమ్ సిద్ధిస్తుంది–
అందుకే సోషలిజమ్ వచ్చి తీరుతుందంటాను
కనీసం "శోష"లిజమైనా రాకపోదంటాను"

దీంట్లోగూడా యీయన సోషలిజానికి నిర్వచనం చేస్తున్నాడో, అది వద్దంటున్నాడో, గేలిచేస్తున్నాడో ఏమీ తెలియదు. ఇట్లాంటి అవగాహనగల కవినుండి ఎటువంటి సామాజిక కవితని ఆశించగలమో తెలుసుకోవాలంటే ఈకావ్యం తప్పక చదవాలి–

అభ్యుదయ, విప్లవకవుల విభేదాల్నిగూర్చి, తన ధోరణిలో తానొక శాస్త్రీయ అవగాహన చూపిస్తూ "మొన్న నిన్న నేడు రేపు"అనే గేయంలో యీ కవి ఒకమాట అంటాడు–

"ఎవడికి తోచినట్టు వాడిని రాసుకోనివ్వండి
వీలువెంట మేసుకోనివ్వండి"

ఇట్లాంటి కావ్యాల్ని చూస్తుంటే, ఈ మాటలే అనాలని పిస్తుంది–

ఇట్లాంటి వచన కవితా సంపుటికి సాహిత్య అకాడమీ ద్రవ్య సహాయం చెయ్యడం చాలా సముచితంగా ఉంది.

— అరా రా

కూతరాని సైరన్

సైరన్
(కవితా సంకలనం)
యువరచయితల సమితి

పేజీలు 80 | నల్లగొండ | వెల: రు. 1-50

నదులకి వరదలొస్తూవుంటాయి. ఆలాగే సంఘానికినీ, ఉద్యమాలూ, ఆందో ళనలూ జీవితానికీ, సంఘానికీ కొత్త నీరు పట్టిస్తూ వుంటాయి. నొ్పవారు చెప్పినట్టు 'క్రొత్తనీటివెంట క్రొద్దిగ గొప్పయో చెత్తచెదారము కొట్టుకొనుచువచ్చు'. అంచేత అంతా ఆరోగ్యకరం కాకపోయినా యీనాటి సాహిత్య జీవితానికిపడుతున్న నీరు యీవరదలో భాగమే.

శ్రీ శ్రీ షష్టిపూర్తి తర్వాత ఉద్యమాల వరదతాకిడి సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఫలితంగా అసంఖ్యాకంగా కవితా సంకలనాలు వెలువడుతూ వుండటం, యువరచయితలు గళం, కలం విప్పడానికి ప్రియత్నించడం ఒక రొటీన్‌లా తయార వుతున్నాయి. విమానాలు కనిపెట్టినప్పుడుండే సంచలనం తర్వాత తర్వాత ఎక్కేవాళ్లకి వుండదు. మోటారుకార్లు కొత్తగా పుట్టినప్పుడున్న ప్రతిఘటన తర్వాత తర్వాత నశించి పోతుంది. బాబాలూ, స్వాములవార్లూకూడా మోటార్లు యెక్కుతారు, విమానాల్లో దూసుకుపోతారు! అలాంటి ప్రమాదాలు ఉద్యమాలకీ పట్టడం మనదేశంలోవాళ్ళకేమీ కొత్తకాదు. బుద్ధుణ్ణికూడా అవతార పురుషుణ్ణి చేసినవాళ్ళం మిగతా పనులు అవలీలగా చేసేస్తాం. అంచేత ఉద్యమాలు నిర్వహించేవాళ్లు జాగ్రత్తపడ్డం అవసరం. మన యిష్టులే మనకి ఎక్కువ కష్టం కలిగిస్తారు. యీనాటి సాహిత్య ఉద్యమంలో- అరసం కానీండి, విరసం కానీండి- చాలామంది భాగస్వాములకి విశిష్ట లక్ష్యశుద్ధి అలవరచు కోవాల్సిన అవసరం వుంది.

ఈనాడు మౌలికంగా కొన్ని సూత్రాలను 'అన్నిశాఖల' వాళ్లూ అంగీకరిస్తున్నారు. (ఉద్యమాలు కొన్ని కొత్త విలువలని standardise చెయ్యడం అసవాయితీ) అందులో ఒకటి యీనాటి సంఘంలోని కొసుగులన్నిటికీ పరిష్కారం సోషలిజపు ఆయుధమనేది. 'సా న్యుడు' అనేవాడిమీదా, వాడికిజరిగే అన్యాయంమీదా జాలీ, కసీ ఒక్క ఉదుటున

పుట్టుకువచ్చి యీ అవక తవకలన్నీ సవరించి వదులైన సంఘపు కీళ్లు సోషలిజంలో బిగించి, గట్టి యేర్పాట్లు చెయ్యడమనేది. కాని దీనికితగ్గ సంకల్పబలమూ, లక్ష్యశుద్ధీ విషయమై ఎవరూ పట్టించుకోవడం లేదు. శాస్త్రీయదృక్పథం, ఆధునికత సాంఘిక చారిత్రిక దృష్టిలాంటి ప్రాథమిక విషయాలేనా తెలుసుకుని వుండటం ధర్మం. ఏ మార్గంద్వారా ప్రయాణంచేస్తే లక్ష్యం చేరుకోగలమోనన్న జ్ఞానం వుండటం అవసరం. ఈనాటి సాహిత్య ఉద్యమకర్తల్లో చాలామంది యిది తెలుసుకోవాల్సివుంది. (సాహిత్య ఉద్యమాలు నిర్వహించేవాళ్లు అని నొక్కి చెప్పడం అవసరం.)

ఇదంతా చెప్పడం యెందుకంటే ట్రాన్సిస్టర్ గురించి తెలియని అనాగరికుడు కూడా ట్రాన్సిస్టర్ తిప్పడం నేర్చుకోవచ్చని కొ. కు. చెప్పినట్టుగా, సాంఘిక సూత్రాల గురించి తెలియని ఎవరేనా సోషలిజం గురించి యీనాడు మాట్లాడవచ్చని గుర్తు చెయ్యడానికే.

ఈనాటి సాహిత్యంలో యిలాంటి పరిస్థితి వుందని చెప్పడానికి 'సైరన్' లాంటి కవితా సంకలనాలు దాఖలా. నల్లగొండ యువరచయితల సమితివాళ్ళకి 'అన్యాయాన్ని ప్రతిఘటించడమే' లక్ష్యం. వీళ్ల కవితావస్తువు సామాన్యుడు. "వాస్తవికతను సాహిత్యంద్వారా దర్పణం పట్టి నిద్రాణమైన జాతిని మేల్కొల్పడానికి వేస్తున్న కేక 'ఈ సైరన్' కవితా సంకలనమనీ వీళ్ళనుకుంటున్నారు. "నవసమాజ నిర్మాణానికీ దేశక్షేమానికీ" నడుంకట్టి రక్తం చిందించే ప్రతివ్యక్తికీ తమ కృషి అంకితం చేసుకున్నారుకూడా, కానీ ఎటువచ్చీ లేనిదల్లా నవసమాజ నిర్మాణానికీ నిద్రాణమైన జాతిని మేల్కొల్పడానికీ అవసరమైన శాస్త్రీయ సాంఘిక అవగాహనా, దృఢమైన గొంతుసూ. ఇవే వున్నట్లయితే నిజంగానే యిది 'సైరన్' అయి వుండేది. "గాంధీజీ ఆశయాలకు/పంచశీల సూత్రాలకు/శాస్త్రీజీ నిరాడంబర జీవితాన్ని/అనవరతం ఆదర్శంగా వుంచుకొని/పేదల పాలిటి కామధేనువై/సమజీవన సహకారానికి దోహదంగా/కులమతాలకు దూరంగా/నిత్య సత్య జీవనానికి సమీపంగా" సాగిపొమ్మనే('సాగిపో' అన్న గేయం) సోషలిస్టు కల శాస్త్రీయ సోషలిజానికి ఆమడదూరంలోవుందని తెలుసుకునేవుంటే యిది నిజంగానే 'సైరన్' అయేది. అప్పుడు 'క్షమార్హుణ్ణి'(గేయం)అని దైవప్రార్థన చెయ్యరు (ఈగేయం 'వేదాంతభేరి'కి పంపించవచ్చు) "మమతానురాగాల సమతను సాధించాల"నీ, దాంతో నవభారతం నందనవనం కావాలనీ ('చైతన్యస్రవంతి') వెర్రి ఆలోచనలు చెయ్యరు. ఇలాంటి సోషలిజమూ, యిలాంటి సమతనేనా యీనాడు కోరుకొనేది?

ఈ సంకలనంలోవున్న 43 గేయాల్లోనూ యిదేదృక్పథం వుందనికాదు. "ఒక మనిషి/వేరొక మనిషిని/బానిసగా/తన విషపుకోరల్లో ఇరికించి/ఉక్కుపాదాలకింద/నలుగ

గొట్టి/తరతరాలుగా వచ్చే/ఈ దగాతనం/ఈ దోపిడీ వ్యవస్థ/అంతంకావాలని/నవసమాజ స్థాపనకై/సమజీవన సాధనకై" (జీవనహేళి)గీతం రాస్తాననే సంకల్పాలూటీ, ఒక అరా వున్నారు. కాని వీళ్ళది కిందిచెయ్యే. ఇలా యీ సంకలనంలో భిన్నధోరణులుండటానికి కారణం లక్ష్యానికి తగ్గట్టుగా కృషిని మలచుకోపోవడమే.

వస్తువుకి సంబంధించినట్టుగానే కవిత్వానికి సంబంధించీ యీ 'యువకవులు' పదును నేర్చుకోవాలి. యీ సంకలనం మొత్తంమీద కవిత్వపు విలువలు సంతరించుకొని వున్నగేయం పూర్తిగా ఒక్కటీలేదు. ఆశ్చర్యం కలిగించేదేమంటే యువకుల్లో సహజంగావుండే రగిలించే ఆవేశం వీళ్లల్లో ఎక్కడా లేకపోవడం. యీ కేటలాగు కవిత్వంవల్లనే వీళ్ళ సైరన్‌కి కూతరాలేదనిపిస్తుంది.

వస్తువుకీ లక్ష్యానికీ సంబంధించి నిశితత్వం అవసరం. యీ రెండూవున్నాక కవిత్వానికి సంబంధించినవాడి అవసరం. యీ సంకలనంలోని వస్తువునిగురించిన పేచీ లేదు. పోతే లక్ష్యాన్నిగురించిన కచ్చితమైన దృష్టి అందరికీలేకపోవడం: వంచనలేని దృష్టి వున్నట్టయితే యీలోపం కొంత అధ్యయనంలో సర్దుబాటు చేసుకోవచ్చును.

కాని యెటొచ్చీ కవిత్వాన్ని గురించి మాత్రం యిది పనికిరాదు. కవిత్వానికి అవసరమైన ఆవేశమూ, పదసంచయము, భావశబలతా, 'కదిలేదీ, కదిలించేదీ'అయిన శక్తీ లేని లోపాలు పూడటం కష్టం. అవి పాఠ్యాంశాలుగా నేర్చుకోవడమూ సాధ్యం కాదు. అందుకనే యీ సంకలనంలోని యెక్కువభాగం 'మాగజీన్ స్టఫ్' లాగావుంది. రాయాలన్న సరదావుందిగాని తగ్గ సరంజామా లేదీయువకులకి. భాషాస్ఖాలిత్యాలున్నా అవి చెప్పటంలేదు. యెందుకంటే యిలాంటి చిల్లరవిషయాలు బూర్జువా లాక్షణికుల పనిట. కాబట్టి అలాంటి పాపం ఒడిగట్టుకోడం యిష్టంలేక వదిలేస్తున్నాను. (విప్లవకారులు ఉడకని అన్నం తింటారుకదా)

పోతే యీ యువకవులలో చాలామందిని ప్రోత్సాహపరచవచ్చు. యెందుకంటే వీళ్లు కొత్తగా కృషిచేస్తున్నవాళ్లు: పోజులేనివాళ్లు: తెలియనితనం వున్నా తెలివిమీరినతనంలేనివాళ్లూ కాబట్టి.

— ఆర్వీయార్

భూషణం కథలు:

["ఏది సత్యం—ఏదసత్యం" "న్యాయం" కథల సంపుటాలు.
రచన: భూషణం, ప్రచురణ: మొదటిది; సోషలిస్ట్ పబ్లికేషన్స్, విజయవాడ-2, రెండవది: విశాఖ జిల్లా ఉపాధ్యాయ ఫెడరేషన్, చోడవరం, వెల: ఒక్కొక్కటి ఒక రూపాయి]

"భూషణంగారి కథలు సరదా కథలుకావు, మోసం కథలుకావు, అవన్నీ నీతి మార్గాన్ని అన్వేషించే కథలు. అవినీతిని ఎత్తిచూపించే కథలు, సంఘాన్ని మంచికి మార్చడానికి ప్రయత్నంచేసే కథలు. చిన్నవైనా పెద్దకథలు— అంటే మంచి కథలు" అని రాచకొండ విశ్వనాథశాస్త్రిగారూ "అందంగా చెప్పే అబద్ధాలపట్ల కన్నా అసమగ్రంగా చెప్పినా కటువైన సత్యాలపట్లే (కొందరికి) ఆసక్తి. మనుషుల్ని మైదుపుచ్చే రసాలు వారికి సరిపడవు. మనిషిని తట్టి లేపే దాన్నే ఉత్తమ సాహిత్యంగావారు గుర్తిస్తారు. అటువంటివారికి భూషణంగారి కథలు బాగా నచ్చుతాయి" అని కాళీపట్నం రామారావుగారూ ఈ కథలను ప్రశంసించేరు "ముందుమాట"ల్లో.

ఈ సంపుటాల్లోని పద్నాలుగు కథల్లోనూ యీ "కటువైన సత్యాలు" నగ్నంగా ప్రదర్శింపబడ్డాయి. ఈ నగ్నతకూడా బట్టబయలుగానే ఉందిగానీ సగం- సగం చెప్పి మిగతాదికూడా చెప్పేయటం మర్యాదస్తుల లక్షణం కాదు గనుక— పాఠక మహాశయులారా! మీరే ఊహించుకోండి! అనే ధోరణిలో లేదు.

ఓకథలో పనిమనిషి నూకాలుకు ఆమె పనిచేసే ఇంటి'దొర'వారిమాపులు 'పిల్లా నీ అందం కోడికూరలా.... గోంగూరలా.... అలా.... అలా.... నంజుకు తిందామని ఉందే!"అంటున్నట్లే ఉంటాయి. ఇలా వ్రాసేయటం బుద్ధిమంతుడైన రచయిత లక్షణం కాదేమోగానీ, వాస్తవంలో అలాంటి "దగుల్బాజీ దగ్గిర అంట్లుతోమడమేగాదు— అప్పు కూడా తీసుకోవలసి వచ్చినందుకు ఆమె పౌరుషం ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి పోయింది. అభిమానం ఆయాసంతో మూర్ఛపోయింది."

ఈ కథల్లో పొదుపుఉద్యమ సర్టిఫికేట్లు కొనమని శాసించే ఆఫీసరుతో "అయ్యా! బిడ్డల కడుపుకే యీ కరువులో యింత అన్నం పెట్టలేక పోతున్నాం. భవిష్యత్తుకేం పొదుపు చేయగలుగుతాం?" అన్నందుకుగాను జీతం బిగబట్టబడిపోయిన సుబ్బారావు పంతుళ్లున్నారు.

కొన్ని వేల మూలధనాన్ని మంచినీళ్లలాగ ఖర్చుపెట్టి పేట పేటలకి సంతర్పణలు పెట్టించి, దళారిగాళ్లకి డబ్బిచ్చి, భజన సమాజాలకి మద్దెల తాళాలు యిచ్చి, రెండొందలమంది మాస్టర్లమీద- సలభై పంచాయతీలకి ఏకగ్రీవంగా ప్రెసిడెంటయి, వాళ్లని తినమరిగిన పులులున్నాయి.

లేమికి కారణం కనుక్కోలేక, దగ్గరి దారిన ఐశ్వర్యం సాధించే భ్రిమలతో క్లబ్బుల్లో పేకాటలోపడి హైసొసైటీ నందుకోవాలనే ఆశల్నుండి సరాసరి మురుగ్గుంటలోకి విసరేయబడిన అప్పారావులున్నారు.

నాయకులచుట్టూ తిరిగి పైరవీల్తో పనులు జరుపుకుని, కలో-గంజోతాగి పడుండక, ఇదేమిటదేమిటని పట్టిగ్గా నిలేసి ప్రశ్నించినందుకుగాను బేడీలు పడిన నిరుద్యోగ విశ్వంలు ఉన్నారు.

'ఆకలి' అని చెప్పుకోగల సత్తువకూడాలేని కొడుకుని చూడలేక "ఎందుకురా అయ్యా! ఈ డబ్బులేనోడి కడుపున పుట్టేవు? ఏటి తినాలని? ఏ సుఖం అనుభవించాలని?" అని వాపోయే అప్పలయ్యలున్నారు.

"అమెరికా ప్రజలనుండి ఆంధ్రప్రదేశ్ పిల్లలకు" ప్రేమపూర్వకంగా అందిన పురుగులుపట్టిన నూకబస్తాల్ని చూసి "ఈ బిడ్డలు అమెరికావాడి తిండి తిని, వాడి పాలు తాగి బతికి ఎవరిమీద విశ్వాసం చూపించాలి? ఒకరి ధర్మంమీద పెరిగిన జాతి స్వతంత్రింగా ఆలోచించగలుగుతుందా?" అనుకుని చివరికి ఆ నూకలబస్తాలు, నూనెడబ్బాలకు కూడా కక్కుర్తిపడి, పంచుకుని, అమ్ముకుని డబ్బుచేసుకునే ఆఫీసర్లనుచూసి "ఓహో, స్వతంత్ర భారతపౌరులారా! అమెరికావారి ధర్మాన్ని ఎంచక్కగా పంచుకుంటున్నారు?" అని నవ్వుకునే నిర్వేదపు సుబ్బారావు మేస్టర్లున్నారు.

ఈ కథల్లో కొన్నిలోపాలు లేకపోలేదు. ఓ కథలో ప్రెసిడెంటుగారికోరిక తీర్చ నిరాకరించి శంకరగిరి మన్యాలకు బదిలీఅయిపోయిన ముఖ్యసేవిక గురించిరాస్తూ 'కృష్ణా జిల్లానుండి (అంటే చాలాదూరంనుండి) కడుపుచేతబట్టుకుని ఒక ఆడకూతురు, అమ్మా! అయ్యా ఉన్న అనాధ వచ్చింది. సమితిలో ముఖ్యసేవికగా పనిచెయ్యడానికి వచ్చింది. ఆడకూతురు చాలా అందంగాఉంది. ఆవిడ తల్లిదండ్రులకీ వేలు కట్నం యివ్వగలశక్తి ఉంటే, ఈపాటికి వివాహం జరిగిపోయి ఒకరిద్దరు బిడ్డలుకూడా పుట్టి ఉందురు. కానీ ఆవిడ ఆ అదృష్టానికి నోచుకోలేదు" అని వర్ణిస్తారు రచయిత.

కానీ, మరో కథలో "గ్రామసేవికలు అందంగా, మందమందంగా నడుస్తూ చూపరులకు సుందరంగా కనిపిస్తున్నారు. వారి గుండెలు సమితాఫీసుభవనంలా ఎత్తుగా

ఉన్నాయి. వారి నడకలో బరువుగా కదుల్తున్న వెనుక భాగం సన్నకారు రైతులకు దొరకని అమోనియాబస్తాల్ని గుర్తుకు తెస్తున్నాయి. వారి పెదాలు ప్రెసిడెంట్లనుచూసి అందంగా నవ్వుతున్నాయి. వారి కళ్లు హాయిగా మెరుస్తున్నాయి. బహుశా వారివారి బతుకులు పేడలోని పురుగుల్లా అసహ్యంగా వుండి వుంటాయి"అని వర్ణించారు.

ఈ గ్రామసేవికలూ ఆ ముఖ్య సేవికలాంటి దురదృష్టవంతులే అయినపుడు మనం సానుభూతిగానీ, ఆగ్రహంగానీ ప్రదర్శించవలసిందెవరిమీద? దేనిమీద? ఎందుకోసం?

భూషణంగారి కథల్లోగల చిన్న చిన్న లోపాల్ని కనపడనీయని సుగుణం ఒక టుంది. ఈ కథలన్నీ అనుభవంలోంచి ఉబికిన ఆవేశం నుండి, వేదన నుండి, ఆగ్రహం నుండి వెలువడినట్లున్నాయ్ గానీ, తెచ్చిపెట్టుకున్న"పాండిత్యం"తో వ్రాసినట్లుండకపోవటం విశేషం.

నాలుగున్నర సంవత్సరాలనాడు అచ్చయిన మొదటి కథాసంకలనానికి 'మనవి' వ్రాసుకుంటూ "ఈ పరిస్థితులు మారాలి, ఈ మార్పును ఎవరో తెస్తారనికూడా నేను అభిప్రాయపడలేదు. నరకంలాంటి బతుకుల్ని వెళ్ళమారుస్తున్న బాధామయజీవులే ఆ పని చేయాలి; చేస్తారు. ఇవాళ కాకపోయినా రేపయినా వారు తమ పరిస్థితులకు మూలకారణం తెలుసుకుంటారన్న ఆశ నాకుంది!"అన్నారు రచయిత. శుభం!

— చలసాని ప్రసాదరావు.

సాహిత్యలేఖ:

విప్లవ కవిగా మావో

సహృదయులు కె వి. రమణారెడ్డిగారు మావో గీతాలకు నేను చేసిన స్వేచ్ఛాను వాదాన్ని 'సృజన' నవంబరు సంచికలో ప్రస్తావించారు.

1. రమణారెడ్డిగారు "మావోగీతాలు(కొన్ని)థ్రిల్లింగ్‌సాంగ్స్. వార్ డ్రమ్స్. అవి తాత్విక సమాలోచనలు" అనే వాక్యం ఉత్సాహాతిశయాన్ని సూచించేంతగా యదార్థాన్ని సూచించడంలేదు అని వ్రాశారు. "చార్వాకగారన్నట్లు థ్రిల్లింగ్ సాంగ్స్ అయ్యాయో లేదో తెలియదు" అని వ్రాశారు.

[నా వ్యాసంలోని 'డ్రిల్లింగ్ సాంగ్స్' అచ్చుతప్పు. అవి థ్రిల్లింగ్ సాంగ్స్.]

మావో వ్రాసిన గీతాలను చైనా గాయకులు పాడుతుండగా వింటేనేగాని అవి థ్రిల్లింగ్‌సాంగ్స్, వార్‌డ్రిమ్స్ అవునో కాదో చెప్పడం కష్టమే. ఒకసారి చైనాగాయకులు ఆ గీతాలను పాడుతుండగా నేను నా మిత్రులతో కలిసి వినటం తటస్థించింది.

(పెకింగ్ రేడియోలో)

ఆ గీతాలలో కొన్ని నిజంగా థ్రిల్లింగ్‌గా, వార్ డ్రిమ్స్‌గా ఉన్నాయని విన్న మిత్రులందరం అనుకున్నాం.

అయితే మావో గీతాలలో కొన్ని తాత్విక సమాలోచనలా? అనే ప్రశ్న ఉంది.

నేను, పెకింగ్ ఫారిన్‌లాంగ్వేజెస్ ప్రెస్ ప్రకటించిన 'మావో గీతాలు' [Mao Tse-Tung Nineteen Poems with Notes by Chou Chen-fu and An appreciation by Tsang Keh-Chia (1958)] అనే పుస్తకం ఆధారంగా నా అనువాదాలు చేశాను. ఈ పుస్తకానికి సుప్రసిద్ధ చైనా రచయిత ట్సాంగ్‌కె-చియా ఉపోద్ఘాతం వ్రాశారు. అలాగే చివరలో ప్రతి పద్యానికి వివరణ, వ్యాఖ్యానం విపులంగా వ్రాశారు. అందులో ముఖ్యంగా "శిశిరంలో వసంత స్వప్నాలు", 'మంచు', 'ఈత' గీతాలను తాత్విక సమాలోచనలుగా ఆయన వివరించారు. పై రెండు కారణాలవల్ల నా వ్యాసంలో "మావోగీతాలు(కొన్ని)థ్రిల్లింగ్‌సాంగ్స్ వార్ డ్రిమ్స్. అవి తాత్విక సమాలోచనలు" అని వ్రాశాను.

2. రమణారెడ్డిగారు "చార్వాక అనువాదాలను ఇంగ్లీషు మూలాలతో సరిపోలిస్తే మావో కాల్పనికవాది అనుకోవలసి వస్తుందేమో" అని వ్రాశారు "ఈ శిశిరంలో వసంత

స్వప్నాలు" అనువాదాన్ని ఇందుకు ఉదాహరణగా చూపించారు. చైనా వివరణకర్త ట్సాంగ్ కె-చియా ఈ గీతం ప్రకృతి వర్ణనలతో ప్రారంభమై తాత్విక సమాలోచనలతో పతాకస్థాయి నందుకొంటుందని వ్రాస్తూనే, గీతంలోని మొదటి భాగంలోగల ప్రకృతి వర్ణనలలోని అందచందాలను ఎంతో విపులంగా వివరించారు. ఆ వివరణ ఆధారంగా ఆ అందాలను అనువాదంలోకి తీసుకురావడానికి ప్రయత్నించాను.

3. 'అమరులు' గీతంలో 'మల్లియ' 'మొగిలి' అనటం సమంజసంగా లేదని రమణారెడ్డిగారు వ్రాశారు. "అనువాదంలో 'మల్లియ' 'మొగిలి' మెత్తదనానికి నిదర్శనలైతే, మూలంలో పోప్లార్, విల్లో వృక్షాలు, గట్టి దనానికి నిదర్శనలు. ఆ గట్టి దనాన్ని సూచించే మాటలు తెలుగులో వాడి ఉంటే బాగుండేది" అని వ్రాశారు.

అయితే చైనా రచయిత Tsang Khechia రమణారెడ్డిగారి భావానికి పూర్తి వ్యతిరేకంగా భావిస్తున్నారు. ఆ పదాలు గట్టిదనానికి గాక 'గాలిలో తేలియాడే విల్లో పూల'కే సూచన అంటారు.

"Yang K'ai-hui's surname means 'paplar' and Lieu chih-hsiin's surname 'willow'. The two charecters yang-liu taken together also mean 'willow'; hence the second line evokes both the ascent of the souls of the two fallen comrades and the image of willow catkins floating lightly in the breeze" [చూడు: Stuart Schram's 'Mao 'Tse Tung' ఆఖరి పేజీ. క్రిందగీతలు నావి]

మావో గీతాలను అనువదించటంలో నేను నాముందు ఉంచుకొన్న లక్ష్యం ఇది:

[నేను భావించే] సృజన పాఠకుని అభిరుచికి నా అనువాదం చేరువగా ఉండాలనేది. ఆ లక్ష్య సాధనకు నేను అనుసరించిన మార్గం ఇది :

1. నేటి తెలుగు వాడికి బాగా పరిచయమైన ఆధునాతన నడకల్లో అనువాదం ఉండాలి. తెలుగుదనం వుండాలి.

2. మావో గీతాల అనువాదానికి మళ్ళీ ప్రత్యేక వివరణ, టీకా టిప్పణి వ్రాయకుండా చైనా వ్యాఖ్యాత వివరణలోని అవసరమనుకున్న భావాలను అనువాదంలోకి తీసుకరావాలి.

3. అలా అని మావో గీతాల్లోని భావాలకు భంగం రానివ్వరాదు.

ఈ లక్ష్యం ఉండటంచేత, ఈ అనువాద మార్గాన్ని ఎంచుకోవటంచేత రమణారెడ్డిగారు సూచించిన 'బహునియమ బద్ధంగా ఉన్న మావో కావ్యరూపాన్ని, సాంప్ర

దాయకమైన, ప్రామాణికమైన (classical) మావో కావ్యరచనా పద్ధతిని' నా అనువాదంలో పాటించలేక పోయాను.

ఈ లక్ష్య సాధనకు మావో గీతాలకు చైనా వ్యాఖ్యాత వ్రాసిన వ్యాఖ్యానం, అప్రిసియేషన్, వివరణ సహాయం తీసుకోవడంవల్ల మూలంలో లేని పదాలు, చరణాలు, అనువాదంలో వచ్చాయి. "A good translation is a creative art" అనే నిర్వచనాన్ని నా ప్రమాణంగా స్వీకరించాను.

విప్లవోద్యమంలోనూ, విప్లవ సాహిత్యోద్యమంలోనూ మనం చేస్తున్న నేటి సమిష్టి కృషినుండే రేపు 'మోదుగుపూత' కాక 'రెల్లుపూత' ను సృష్టించగల సమగ్ర శక్తులు ఉద్భవిస్తాయని ఆశిద్దాం. ఈ ఆశ అత్యాశకాదు

— చార్వాక

ప్రస్తుతం సృజన దగ్గర అమ్మకానికి సిద్ధంగావున్న పుస్తకాలు

1. తెలంగాణ పోరాట పాటలు		రు. 1-00
2. నాంది నాటకం	గంగిరెడ్డి	1-00
3. జనసేన పాటలు	జనసేన	1-00
4. కవిత్వం-చైతన్యం	త్రిపురనేని మధుసూదనరావు	1-50
5. ఎర్రపిడికిలి	కె. వి. రమణారెడ్డి	3-00
6. గెరిల్లా	విప్లవ గీతాలు	1-00
7. నాకుటుంబం నవల	టావ్ చెంగ్	2-00
8. భారతీయ తత్వశాస్త్రం - ఒక పరిశీలన	నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు	1-00
9. కళ	సంపాదకుడు- చలసాని ప్రసాదరావు	5-00
10. మహోదయం బుర్రకథ	కానూరి వెంకటేశ్వరరావు	1-00
11. రక్తగానం	కవితా సంకలనం చైతన్య సాహితి అనంతపురం	1-00
12. తూర్పుగాలి	నగ్నముని	3-00
13. సమరం	సంకలనకర్త అగ్నిమిత్ర	1-00

గెరిల్లా

విప్లవ గీతాలు

సృజన ప్రచురణ వెల 1 రూపాయి

గెరిల్లా విప్లవ గీతాలలో యీ కింది సవరణలు చదువుకోవాల్సిందిగ పాఠకులను కోరుతున్నాము.

తప్పు	ఒప్పు	పేజి
ప్రిపంచ కార్మికులంతా	ప్రపంచ శ్రామికులంతా	10
నీ స్వప్నం సిద్ధించును	నీ స్వప్నం ఫలియించును	11
అంతి వింతి రెడ్డి వగలుపోయాడు:	అంత వింత రెడ్డి వగలుపోయాడ:	18
భరితభూమి కనులు తెరిచి	భరతభూమి కనులు తెరచి	21
,,	,,	22
జనభాణం తగిలి పగిలి	జనబాణం తగిలి పగిలి	25
తీన్ మీన్ పై ఎగిరే	తీన్ మీన్ ముంగిట ఎగిరే	26
నవజగతిని, నిర్మించగ	నవజగతిని నిర్మించగ	36
నేను రైతు కసితో విరిపిన గండ్రిగొడ్డలిని	నేను రైతు కసితో విసిరిన గండ్రగొడ్డలిని	42
బంధూక్ను వదిలిపెట్టేందుకు	బందూక్ను వదిలిపెట్టేందుకు	44
ఎర్రిగానే హస్తమిస్తాడు!	ఎర్రిగానే అస్తమిస్తాడు!	44

ఇంతేకాక 19 వ పేజీలో చీమచిటుకనగా చీకటిలో కరిగిపోయింద అనే చరణం తర్వాత స్పేస్ యిచ్చి కారుమబ్బులొచ్చె, కటిక చీకటికమ్మె అనే చరణం చదువుకోవాలి

23 వ పేజీలో అలలు సముద్రం చేతికలం! స్పేస్ అలలు! ఆలలు! అలలు! ఉదయంనిండా అలలు! అని చదువుకోవాలి.

45 వ పేజీలో విజయం దిక్కుగా పయనిస్తారు తర్వాత స్పేస్ రెనగేడ్! చదువుకోవాలి.

SRJANA Telugu Monthly **Dec. '72** **Regd. No. H-1**
Regd. No. with Registrar of News Papers 10953/67

సుప్రసిద్ధ జనచైనా రచయిత్రి
టావ్ చెంగ్
నవల
నా కుటుంబం
ఆదరించిన సృజన పాఠకులకు

73 జనవరి నుంచి

మరో విప్లవ సాహిత్య కానుక



1951 స్టాలిన్ బహుమతి పొందిన నవల

జనచైనా రచయిత

చౌలి-పో హరికేన్ (Harricane)కు

తెలుగు అనువాదం

ఎస్. ఎస్. ప్రకాశరావు

I Re